అక్షరకలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్గిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 93962 18955

epaper. aksharakalam. com

# అక్షరకలం

aksharakalam@gmail.com

తెలుగు దినపత్రిక

AK NEWS 24X7

సంపుటి : 19 సంచిక : 152 | 25-08-2026 మంగళవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



## మహిళలకు తమిళ సీఎం
# విజయ్ వరాలు

వివరాలు 2లో..

జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.



## సెప్టెంబర్ 11న బ్యాంక్
# యూనియన్ల సమ్మె

దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు.



## అమెరికా యుద్ధాన్ని
# కొనసాగిస్తే అంతే సంగతులు

### ఒక్కచుక్క చమురును కూడా సరపరా కానివ్వం
### ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు

అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సేన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

2



## నా పర్యటనకు ఎందుకు
# అభ్యంతరాలు..

- నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించడమే
- నిబంధనల ప్రకారమే యూఎస్ టూర్‌కు దరఖాస్తు
- వివరాలు ఇవ్వలేదంటూ బీజేపీ నేతల ప్రచారం పూర్తిగా అబద్ధం
- పార్లమెంట్‌లో (లోక్‌సభ, రాజ్యసభ) తీవ్రంగా నిలదీస్తాం
- సీఎం రేవంత్

వికసిత్ భారత్ స్ఫూర్తితో తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంతో ముందుకు వెళ్తున్న తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం కావాలనే అడ్డుకుంటోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి, డిసెంబర్‌లో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించడానికి తాను తలపెట్టిన అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతోనే రద్దు చేసిందని ఆయన ఆరోపించారు.గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కెనడా, అమెరికా పర్యటనలకు అనుమతినిచ్చిన కేంద్రం... తెలంగాణ ముఖ్యమంత్రి రైజింగ్ తెలంగాణ కోసం వెళ్తామంటే అనుమతులు తిరస్కరించడం ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని మండిపడ్డారు రేవంత్ . సీఎం పర్యటనను అడ్డుకోవడం కేవలం వ్యక్తిగత అడ్డగింత కాదని, అది నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించడమేనని అన్నారు.

వార్త 2లో



## హెచ్ఎండిఏ కమిషనర్‌తో
# రఘునందన్ రావు భేటీ

2

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలపై హెచ్‌ఎండీఏ కమిషనర్, మెట్రో రైల్వే మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి చర్చించినట్లు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు పొడిగింపు అంశంపై చర్చించడం జరిగింది.

## కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా
# సుష్మిత వ్యవహారం

కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్

మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్

వార్త 2లో



## ఇంజనీరింగ్ విద్యార్థికి ఉగ్రలింకులు

### అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్న ఎన్ఐఏ

పెద్దపల్లి,

ఎద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ముజామిల్‌ను ఎన్ఐఏ అధికారులు.. ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.



# ప్రైవేట్ సంస్థలకు ఇస్రోలో స్థానం

### ఇస్రో భవిష్యత్‌పై జైరామ్ రమేశ్ ఆందోళన

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో భవితవ్యంపై రాజకీయ దుమారం మొదలైంది. ఇస్రోను మోదీ సర్కారు బలహీనపరుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరామ్ రమేష్ ఆరోపించారు. ఆరు దశాబ్దాలుగా ఇస్రో నిర్మించుకున్న సామర్థ్యాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇస్రో భవిష్యత్ పాత్రకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. రాకెట్ల తయారీ, ప్రయోగ వాహనాల ఉత్పత్తిలో ఇస్రో పాత్రను గణనీయంగా తగ్గించి, ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించే దిశగా ప్రభుత్వం వెళ్తోందని ఆయన ఆరోపించారు. అప్పగించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

# నకిలీ డిఎస్పీగా ప్రజలకు టోపీ

### రూ.1.20 కోట్లు వసూళ్లు
### వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,

నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి.

# గినియాలో కూలిన డంపింగ్ యార్డు

### ప్రమాదంలో 30 మంది దుర్మరణం

న్యూఢిల్లీ,

పశ్చిమ ఆఫ్రికాలోని గినియాలో ఓ డంపింగ్ యార్డ్ కూలడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా సహాయక బృందాలు వారిని ఆస్పత్రికి తరలించాయి. గినియా రాజధాని కొనక్రిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా డంపింగ్ యార్డ్ కుప్పకూలినట్టు తెలుస్తోంది.



2

# కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

# మహిళలకు తమిళ సిఎం విజయ్ వరాలు

### ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన

### ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం

**చెన్నై, అక్షరకలం ప్రతినిధి**

తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతో పాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. కాగా, గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం. ప్రతిపాదిత విమానాశ్ర యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు నేను అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె

### వరుస సెలవులతో కస్టమర్లకు ఇబ్బందులే

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. ఇక సోమవారం14న వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు. అలా నాలుగురోజుల పాటు బ్యాంక్ సేవలు అందక ప్రజలు కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. 11వ తేదీతోపాటు సెప్టెంబర్ 28 నుంచి మూడురోజుల పాటు మరోసారి సమ్మె చేస్తామని యూనియన్ హెచ్చరించింది. సెప్టెంబర్ 30తో ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతుంది. అప్పుడు అన్ని సంస్థలు తమ ఖాతా పుస్తకాలను సరిచూసుకుంటాయి. వారానికి ఐదు రోజుల డిమాండ్‌తో పాటు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం, పింఛను విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బ్యాంక్ సిబ్బంది కోరుతున్నారు. ఇప్పటికే రెండో, నాలుగో శనివారం సెలవులు ఇస్తున్నారు. మరో రెండు సెలవులు ఇస్తే అలా నెలలో ఐదురోజుల పనిదినం అమలవుతుంది. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే.. అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. సమావేశంలో బ్యాంక్ యూనియన్ల సభ్యులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

# అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

### ఒక్కచుక్క చమురును కూడా సరపరా కానివ్వం

### ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయి ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయి హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయి హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ–డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# ప్రైవేట్ సంస్థలకు ఇస్రోలో స్థానం

### ఇస్రో భవిష్యత్‌పై జైరామ్ రమేశ్ ఆందోళన

**న్యూఢిల్లీ,**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో భవితవ్యంపై రాజకీయ దుమారం మొదలైంది. ఇస్రోను మోదీ సర్కారు బలహీనపరుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరామ్ రమేష్ ఆరోపించారు. ఆరు దశాబ్దాలుగా ఇస్రో నిర్మించుకున్న సామర్థ్యాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇస్రో భవిష్యత్ పాత్రకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. రాకెట్ల తయారీ, ప్రయోగ వాహనాల ఉత్పత్తిలో ఇస్రో పాత్రను గణనీయంగా తగ్గించి, ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించే దిశగా ప్రభుత్వం వెళ్తోందని ఆయన ఆరోపించారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల కృషితో ఇస్రో ఆరు దశాబ్దాలుగా అభివృద్ధి చేసుకున్న సామర్థ్యాలను, మౌలిక వసతులను ప్రైవేట్ రంగానికి అప్పగించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రైవేట్ అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రపంచ స్థాయి ప్రతిభను భారత్‌కు ఆకర్షించేలా బలమైన అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇస్రో క్రమంగా ప్రయోగ వాహనాల తయారీ, సాధారణ ఉపగ్రహాల తయారీ నుంచి దూరమవుతున్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# నా పర్యటనకు ఎందుకు అభ్యంతరాలు..?

### నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించడమే

### నిబంధనల ప్రకారమే యూఎస్ టూర్‌కు దరఖాస్తు

### వివరాలు ఇవ్వలేదంటూ బీజేపీ నేతల ప్రచారం పూర్తిగా అబద్ధం

### పార్లమెంట్‌లో (లోక్‌సభ, రాజ్యసభ) తీవ్రంగా నిలదీస్తాం

### సీఎం రేవంత్

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**



వికసిత్ భారత్ స్ఫూర్తితో తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంతో ముందుకు వెళ్తున్న తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం కావాలనే అడ్డుకుంటోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి, డిసెంబర్‌లో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించడానికి తాను తలపెట్టిన అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతోనే రద్దు చేసిందని ఆయన ఆరోపించారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కెనడా, అమెరికా పర్యటనలకు అనుమతినిచ్చిన కేంద్రం... తెలంగాణ ముఖ్యమంత్రి రైజింగ్ తెలంగాణ కోసం వెళ్తామంటే అనుమతులు తిరస్కరించడం ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని మండిపడ్డారు రేవంత్ . సీఎం పర్యటనను అడ్డుకోవడం కేవలం వ్యక్తిగత అడ్డగింత కాదని, అది నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించడమేనని అన్నారు. విద్య, క్రీడలు తదితర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు, ప్రఖ్యాత యూనివర్సిటీలను రాష్ట్రానికి రప్పించేందుకు అన్ని నిబంధనల ప్రకారమే యూఎస్ టూర్‌కు దరఖాస్తు చేశామని స్పష్టం చేశారు. వివరాలు ఇవ్వలేదంటూ బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధమన్నారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తే గుజరాత్‌కు రావేమోనన్న సంకుచిత భావజాలంతోనే ప్రధాని మోడీ, గుజరాత్ నాయకత్వం ఈ కుట్రకు తెరలేపాయని ఆరోపించారు. కేంద్రం వ్యవహరించిన తీరును పార్లమెంట్‌లో (లోక్‌సభ, రాజ్యసభ) తీవ్రంగా నిలదీస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన తెలంగాణ బీజేపీ ఎంపీలు... గుజరాత్‌కు మద్దతు ఇస్తూ రాష్ట్ర ప్రగతిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఒక ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకోవడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

# హెచ్ఎండిఏ కమిషనర్‌తో రఘునందన్ రావు భేటీ

### పెండింగ్ రోడ్డు, రైల్వే పనుల పూర్తికి అభ్యర్థన

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలపై హెచ్ఎండీఏ కమిషనర్, మెట్రో రైల్వే మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి చర్చించినట్లు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు పొడిగింపు అంశంపై చర్చించడం జరిగింది. పటాన్‌చెరు ఎగ్జిట్–3 నుంచి ఎగ్జిట్–4, సుల్తాన్‌పూర్ మధ్య పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగింది. కొల్లూరు ఎగ్జిట్–2 వద్ద పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరడం జరిగిందని అన్నారు.

# కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

### కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

### సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్

### మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలోం పిసిసి చీఫ్

**మెదక్, అక్షరకలం ప్రతినిధి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఎఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# ఇరాన్‌తో ఆట చివరికి వచ్చింది

### యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన

**వాషింగ్టన్,**

:ఇరాన్‌ను ఒంటరిచేయడమే లక్ష్యంగా ఆ దేశంపై ఆర్థిక యుద్ధానికి సిద్ధమైంది అమెరికా. టెహ్రాన్‌కు సాయం చేసే దేశాలపై కఠిన ఆంక్షలు విధించనుంది. ఈ పరిణామాల వేళ అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆట చివరికొచ్చిందని, ఇక ఆ దేశానికి ఆర్థిక వినాశనమేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలపై మేం గట్టి దెబ్బకొట్టాం. ఆ దేశ సైనిక ఫ్యాక్టరీలను 100శాతం ధ్వంసం చేశాం. అణు కార్యక్రమాన్ని సమాధి చేశాం. ఇక ఆట చివరికొచ్చింది. ఏ శత్రువుపైనా ఇప్పటివరకు చేపట్టని అతిపెద్ద ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభించబోతున్నాం. భద్రతా హామీల ముసుగులో ఇన్నాళ్లూ ఇరాన్ బెదిరింపులు చేస్తూ మనుగడ సాగించింది. అమెరికా తమనేమీ చేయలేదని భావించింది. కానీ, ఇప్పుడు ట్రంప్. హయాంలో ఆ శకం ముగిసింది. టెహ్రాన్‌ను ఒంటరి చేసేవరకు.. ఆ నిరంకుశ పాలనను నిలబెడుతున్న ప్రతి ఆర్థిక జీవనాధారాన్ని తెంచడమే మా లక్ష్యం అని స్కాట్ బెసెంట్ రాసుకొచ్చారు.

# కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

### దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,**

తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# తెలంగాణ పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

### గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోడీ

### సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం

### అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం

### పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది

### నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు

### మీడియా సమావేశంలో సిఎం రేవంత్ మండిపాటు

**హైదరాబాద్,**

పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిం దని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అయితే అందుకు విరుద్ధంగా కేంద్ర విధానాలు ఉన్నాయని అన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు.

గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు.

# ఆగస్టు 27న "ఖేలో ఇండియా సంవాద్ -- ఖేల్ కి బాత్ పీఎం కే సాథ్" ల వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీల్డ్ ) క్విజ్ నిర్వహించనున్న మై భారత్

హైదరాబాద్, 24 ఆగస్టు అక్షర కలం

యువజన వ్యవహారాల శాఖ, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ (మై భారత్ ), నేషనల్ సర్వీస్ స్కీమ్ ( ఎన్ఎస్ఎస్ ) మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి ) సహకారంతో 2026 ఆగస్టు 27న "ఖేలో ఇండియా సంవాద్ -- ఖేల్ కి బాత్ పీఎం కే సాథ్" కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమం ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించబడుతోంది. దేశాన్ని ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన మరియు క్రీడా స్ఫూర్తితో కూడిన దేశంగా తీర్చిదిద్దాలన్న గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి దార్శనికతకు అనుగుణంగా, యువత ఆకాంక్షలు మరియు వారి భాగస్వామ్యాన్ని దేశ అభివృద్ధి కార్యాచరణలో కేంద్రంగా ఉంచుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని ఏకకాలంలో నిర్వహించనున్నారు. తెలంగాణలో మొత్తం 46 ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఇందులో హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ( యు ఓ హెచ్ ) మరియు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ( ఈ ఎఫ్ ఎల్ యు ) కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గౌరవనీయ ప్రధానమంత్రి యువతను ఉద్దేశించి వర్చువల్ ప్రసంగం నిర్వహించనున్నారు. అనంతరం ప్రముఖ క్రీడాకారుడితో మోడరేటెడ్ ఇంటరాక్షన్, స్థానిక ప్రజాప్రతినిధి ప్రసంగం మరియు "యువ సంవాద్" నిర్వహించబడుతుంది. యువ సంవాద్ ద్వారా క్రీడా రంగానికి సంబంధించిన అంశాలతో పాటు గుర్తించిన మరో నాలుగు అంశాలపై యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలు మరియు ఆకాంక్షలను పంచుకునే అవకాశం కల్పించబడుతుంది. విద్యార్థులతో ప్రముఖ క్రీడాకారుల ముఖాముఖి; యువ సంవాద్ ద్వారా యువత ఆలోచనలు, ఆకాంక్షలకు వేదికతెలంగాణలో నిర్వహించే కార్యక్రమంలో ప్రముఖ క్రీడాకారులు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. నందిని అగసర (అథ్లెటిక్స్), ధనుష్ శ్రీకాంత్ మరియు ఈషా సింగ్ (షూటింగ్), స్రీజా ఆకుల (టేబుల్ టెన్నిస్) తమ పాల్గొనడాన్ని ధృవీకరించారు. వీరు విద్యార్థులతో సంభాషించి, క్రీడా రంగంలో తమ అనుభవాలు మరియు ప్రేరణాత్మక విషయాలను పంచుకోనున్నారు. అదేవిధంగా, గౌరవనీయ కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి హైదరాబాద్‌లోని ఎంపిక చేసిన కార్యక్రమ వేదికల్లో ఒకదానిలో పాల్గొనేందుకు తన సమ్మతిని తెలియజేశారు. యువ సంవాద్ ద్వారా విద్యార్థులు మరియు యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలు మరియు ఆకాంక్షలను పంచుకునే




అవకాశం పొందుతారు. ఇందుకోసం అన్ని కార్యక్రమ వేదికల్లో క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉంచబడతాయి. వీటి ద్వారా యువత తమ ఆలోచనలు మరియు సూచనలను నేరుగా మై భారత్ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చు. మై భారత్ , తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ శ్రీ అన్వేష్ చింతల విద్యార్థులు మరియు యువత యువ సంవాద్‌లో చురుకుగా పాల్గొని, ఇ= కోడ్ ద్వారా తమ ఆలోచనలు మరియు సూచనలను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా అందే యువత అభిప్రాయాలు భవిష్యత్ విధానాలు మరియు కార్యక్రమాల రూపకల్పనలో ఉపయోగపడే విలువైన సమాచార వనరుగా నిలుస్తాయని ఆయన తెలిపారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీల్డ్ ) క్విజ్‌లో యువత పాల్గొనాలని పిలుపుప్రస్తుతం కొనసాగుతున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీల్డ్ ) క్విజ్లో విద్యార్థులు మరియు యువత చురుకుగా పాల్గొనాలని శ్రీ అన్వేష్ చింతల పిలుపునిచ్చారు. అలాగే 46 కార్యక్రమ వేదికల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను యువత సద్వినియోగం చేసుకుని వీబీల్డ్ క్విజ్‌తో పాటు మై భారత్ నిర్వహిస్తున్న ఇతర కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ దేశ యువత తమ ఆలోచనలను నేరుగా గౌరవనీయ ప్రధానమంత్రి ఎదుట ప్రదర్శించేందుకు, అలాగే వికసిత్ భారత్ఏ2047 లక్ష్య సాధనలో విధాన రూపకల్పన ప్రక్రియలో భాగస్వాములు కావడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. మై భారత్ , రంగారెడ్డి డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుట్కర్ విద్యార్థులు మరియు యువత మై భారత్ పోర్టల్ లో నమోదు చేసుకుని, మై భారత్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు మరియు కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. యువత నమోదు ద్వారా యువజన ఆధ్వర్యంలోని జాతీయ అభివృద్ధి ఉద్యమంతో నిరంతరం అనుసంధానమై, చురుకైన భాగస్వాములుగా కొనసాగవచ్చని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మై భారత్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ జి. రాజేష్ కూడా పాల్గొన్నారు. తెలంగాణలోని విద్యార్థులు, యువత, విద్యాసంస్థలు మరియు సంబంధిత భాగస్వాములు "ఖేలో ఇండియా సంవాద్ -- ఖేల్ కి బాత్ౌవీ కే సాథ్", వీబీల్డ్ క్విజ్ మరియు ప్రత్యేక శిబిరాల్లో ఉత్సాహంగా పాల్గొని, యువత భాగస్వామ్యం, సంభాషణ మరియు దేశాభివృద్ధికి తమ ఆలోచనలను అందించే వేదికలుగా ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మై భారత్ పిలుపునిచ్చింది.




# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



మేడ్చల్, ఆగస్టు 24 (అక్షరకలం):

ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 75 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ు పాల్గొన్నారు.

# ప్రతి వ్యక్తి, ప్రతి ఇంటికి ఒక మొక్క అందించేలా విస్తృతంగా వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టాలి

## --- అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.

అక్షర కలం హైదరాబాద్

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 56.46 శాతం మొక్కల పెంపకం పూర్తయిందని ఈ నెల 25న నిర్వహించనున్న ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమం ద్వారా నిర్దేశిత లక్ష్యానికి అదనంగా కనీసం 10 శాతం మేర మొక్కలు నాటేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం అమలు పై సోమవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జిల్లా వారీగా మొక్కలు నాటే లక్ష్యాలుఇప్పటి వరకు సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 23వ తేదీ నాటికి రంగారెడ్డి జిల్లాలో 78.540 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను 45.287 లక్షల మొక్కలు నాటి 57.66 శాతం సాధన నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా 1606.286 లక్షల మొక్కల లక్ష్యానికి గాను 906.853 లక్షల మొక్కలు నాటి 56.46శాతం సాధన నమోదైంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి, "ఒక్క వ్యక్తికి ఒక మొక్క -- ఒక్క ఇంటికి ఒక మొక్క" అనే విధంగా ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వీఐపీలు, రైతులు, యువత, సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధుల ను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.




దేవాలయాల్లో ప్రత్యేకంగా మొక్కలు నాటాలి

దేవాలయాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను గుర్తించి, ఆయా చెట్ల మొక్కలను సేకరించి దేవాలయ ప్రాంగణాల్లో నాటాలని మంత్రి సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయంగా ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను సంరక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కల పంపిణీ

అన్ని నర్సరీల్లో తగినంత మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కలను మాత్రమే పంపిణీ చేసి నాటించాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, నాటడం, అనంతరం నీటి వసతి కల్పించడం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్టులకు ప్రాధాన్యత

పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు అర్బన్ ఫారెస్టుల ఏర్పాటును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి పట్టణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలని ఆదేశించారు.

చెరువుల పరిసరాల్లో తాటి మొక్కల పెంపకం

తాటి మొక్కలను చెరువుల పరిసర ప్రాంతాల్లో, అలాగే గౌడ సమాజానికి చెందిన భూముల్లో నాటేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి ఈ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో మొక్కల పెంపకంతో పాటు భూగర్భ జలాల పెంపుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీటి నిల్వ మరియు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన గుంతలు, ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, మొక్కలు నాటడం, నీటి సదుపాయం తదితర ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. కిరణ్మయి, జిల్లా అటవీ అధికారి ( డీఎఫ్ఓ) శివ ఆశిష్ సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, డి. ఈ.ఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి సుజాత పాల్గొన్నారు.

# ప్రజావాణికి(53)ఫిర్యాదులు





రంగారెడ్డి అక్షర కలం

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (53) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రెవెన్యూ శాఖ--26, ఇతర శాఖలు --27, మొత్తం 53 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు....

## కేసులకు భయపడను,ప్రజల పక్షాన పోరాటం ఆపను..

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేయాలనే ఆలోచన విరమించుకోవాలి...

## రేవంత్ రెడ్డి సర్కార్‌పై మండిపడ్డ రేగా కాంతా రావు..

అక్షర కలం/ పినపాక..

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా తాను భయపడేది లేదని, ప్రజల పక్షాన తన గొంతు వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. రేవంత్ సర్కార్ చేస్తున్న తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేయాలనే ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మణుగూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. రేగా కాంతారావుపై నమోదైన కేసును కోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తెలంగాణ తల్లి, కొమరం భీమ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న వారిని అణచివేయాలనే ఉద్దేశంతోనే తనపై వరుసగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎక్కడ నిరసన కార్యక్రమం జరిగినా దానిని తనకు ముడిపెట్టడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో తన వాహనంపై దాడి జరిగినప్పుడు సైతం తానే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు.

తప్పుడు ప్రచారాలతో తనను అడ్డుకోలేరు

తనపై తప్పుడు ప్రచారం చేయించేందుకు కొంతమంది నాయకులు పత్రికల్లో కథనాలు రాయించేందుకు ప్రలోభాలకు గురిచేశారని రేగా కాంతారావు ఆరోపించారు. తాను పదవిలో ఉన్న సమయంలో ఎవరి వద్ద నుంచి అన్యాయంగా, అక్రమంగా ఏమీ తీసుకోలేదని, అక్రమ ఆస్తులు కూడబెట్టుకోలేదని స్పష్టం చేశారు. తన పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులపైనే వివాదాలు సృష్టిస్తున్నారని అన్నారు. తన ఆస్తులపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, అవి అక్రమంగా సంపాదించినవా కాదా తేల్చాలని సవాల్ విసిరారు. గిరిజనుల నుంచి కౌలుకు తీసుకున్న భూములకు సంబంధించిన డబ్బులు కూడా వారికి చెల్లించానని పేర్కొన్నారు. పోడు భూముల కోసం తాను చేస్తున్న పోరాటాన్ని అడ్డుకునేందుకు తనకు వేలాది ఎకరాల అటవీ భూములు ఉన్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

తనపై ప్రస్తుత ఎమ్మెల్యేతో పాటు జిల్లాలోని ముగ్గురు మంత్రులు చేసిన ఆరోపణలను నిరూపించాలని రేగా కాంతారావు సవాల్ విసిరారు. దమ్ముంటే మణుగూరు అంబేద్కర్ సెంటర్‌కు వచ్చి బహిరంగ చర్చకు సిద్ధం కావాలని అన్నారు. తనపై తప్పుడు కేసులు పెట్టించినా చివరకు న్యాయమే గెలిచిందని పేర్కొన్నారు. రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని రేగా కాంతారావు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేశారో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా సమస్యలపై చివరి వరకు పోరాడుతానని, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



# ఇల్లందు లో డ్రగ్స్ నివారణపై సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో పట్టణ సి ఐ తాటిపాముల సురేష్ గౌడ్ అవగాహన సమావేశం.

అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-

యువతను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడేందుకు పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సి ఐ తాటిపాముల సురేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి ఐ సురేష్ గౌడ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల ఒక వ్యక్తి జీవితమే కాదు, ఆ కుటుంబం మొత్తం నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం ప్రజా ప్రతినిధులుగా మనందరి బాధ్యతని, ఇల్లందు డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్, సర్పంచులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలల్లో, వీధుల్లో డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, చట్టపరమైన దుష్పరిణామాలపై



విస్తృతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. అదే విధంగా బస్ స్టాండ్, పాన్ షాపులు, మెడికల్ షాపుల వద్ద అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచి, ఎక్కడైనా గంజాయి అమ్మకం లేదా సాగు కనిపిస్తే వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1908,8712671111, ఈగల్ కు సమాచారం అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు ప్రతి వార్డులో, ప్రతి గ్రామంలో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులను చేస్తామని కౌన్సిలర్లు, సర్పంచులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు ఉమ, సారంగపాణి, కౌన్సిలర్లు కొర్లపాటి శివ కిరణ్, మెరుగు కార్తీక్, కానిస్టేబుల్ షేక్ సలీముద్దీన్, పి .నాగేశ్వరావు, దుర్గాచారి, మహేష్, బన్ని లాల్, రాణి, ఎం. నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక

# ఖమ్మం వైద్యరంగంలో నవశకం...

## సంపాదకీయం...

# రూపాయి బియ్యంతో దళారుల దందా

ఉచిత రూపాయికే కిలో బియ్యం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పక్కదారి పడుతోంది. బియ్యం స్మార్ట్ కార్డులు అందచేసినా, చాలావరకు బియ్యం అక్రమంగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టన్నుల కొద్ది బియ్యం పోర్టులు దాటిపోయాయి. తెలంగాణలో కూడా అదే విధంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలించి నయాదందా తెరతీసారు. ఎన్టీఆర్ హాయంలో పేదలకు బియ్యం అందించాలని కిలో రెండు రూపాయలకే పథకం తెచ్చారు. అది పలు రూపాంతరాలు చెంది. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉండగా కిలో రూపాయికే అందిస్తున్నారు. దీని ధరలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్నాయి. ఎక్కడ ఓటు బ్యాంక్ పోతుందో అన్న భయంలో పాలకులు ఉన్నారు. పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వాలు రూపాయి ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా బియ్యం ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లబ్ది అక్రమార్కుల పాలిట 'కాసుల పంట'గా మారుతోంది. రూపాయి లేకపోయినా పేదవాడు ఆకలితో అలమటించకూడదని ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుంటే, ఆ పథకం ఆశయం కాస్తా దారి మళ్లుతోంది. ఉచిత బియ్యం అర్హులైన పేదల కడుపు నింపాల్సింది పోయి, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతుండటం తీవ్ర విచారకరం. తినడానికి ఇచ్చే బియ్యం.. గడప దాటక ముందే విక్రయం జరుగుతోంది. వందలకోటల బిసినెస్ దీనివెనక నడుస్తోంది. ఈ రోజుల్లో చాలా చోట్ల రేషన్ కార్డు ఉండి, రేషన్ బియ్యాన్ని ఆహారంగా వాడుకోని వర్గాలు దాన్ని ఒక అదనపు ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నాయి. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే లబ్దిదారుల ఇళ్ల ముందే దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు, కేవలం ఐదు-పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు.

మరికొన్ని చోట్ల దందా ఇంకొంచెం ముందుకెళ్లింది. అసలు బియ్యం సంచులను ఇళ్లకు కూడా తీసుకెళ్లడం లేదు. షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి, బియ్యాన్ని అక్కడ వదిలేసి, కిలోకు రూ.10 నుండి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విధంగా మిగిలిపోయిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంకొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా.. బహిరంగ మార్కెట్లో వీటిని కేజీకి రూ.20 నుండి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది. ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేసినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల అధికారులు హెచ్చరించడం షరామామూలుగా మారింది. దీంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపడం లేదు. దీంతో వ్యారం యధావిధిగా సాగుతోంది. చ్చరించారు. లబ్దిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగస్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న ఆహార ధాన్యాలను కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ రాబోయే 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖను నేరుగా ప్రజల చెంతకు చేర్చాలనే తపనతోనే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. గతంలో



ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు తరలించే దుస్థితి ఉండేదని, దానిని మారుస్తూ దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది పేదలు లబ్ది పొందుతున్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందక ఇబ్బంది పడిన వారికి ఉపశమనం కలిగిస్తూ.. ప్రభుత్వం కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత అందుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కూడా ఈ కార్డులు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వాలు కఠిన చర్యలు తసీఉకోనంత వరకు ఈ దందా ఆగదు. అక్రమంగా తరలింపు కూడా ఆతదని పాలకులు గుర్తించాలి.

---

### 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి సిద్ధం..

- మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- రూ.23.75 కోట్లతో అత్యాధునిక భవనాలు మరియు సదుపాయాల కల్పన
- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యం
- తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు
- హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం



- మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో సాకారమైన కీలక ప్రాజెక్టు

**అక్షర కలం/ ఖమ్మం: ప్రతినిధి:**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజారోగ్య చరిత్రలో మరో కీలక అధ్యాయానికి నాంది పలికేందుకు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిద్ధమైంది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రి గడప తొక్కే రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన అత్యాధునిక 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. తీవ్రమైన అనారోగ్యంతో, ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరుకునే రోగులకు సత్వరమే అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు



ఈ సదుపాయం ఎంతో దోహదపడనుంది. ఇది కేవలం ఒక భవన ప్రారంభోత్సవం కాదు... ఖమ్మం జిల్లా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం వేసిన మరో దృఢమైన అడుగుగా వైద్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల వేసిన అడుగులు కృషి నేడు ఫలించింది

**నేడు మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం..**

సుదీర్ఘ నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసుకున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నేడు లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ అత్యాధునిక వైద్య సదుపాయం ఖమ్మం ప్రభుత్వ వైద్య సేవల చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించనుంది.

---

# పట్టణంలోని 20వ వార్డులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఇల్లందు మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్.

**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-**

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు, అవార్డు కౌన్సిలర్ జాఫర్ ఆధ్వర్యంలో పట్టణంలోని 20 వార్డులో 17 లక్షల డీఎంఎఫ్‌టీ నిధుల వ్యయంతో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఇల్లందు మునిసిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ 2 0 వ వార్డు కౌన్సిలర్ జాఫర్ లు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగనున్నాయని వారు తెలిపారు. అందులో భాగంగానే మొదటగా 17 లక్షల నిధులు కేటాయించి సిసి రోడ్డు నిర్మాణ పనులకు చొరవ చూపిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక "20వ వార్డు అభివృద్ధే మా ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో వార్డుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించనున్న ఈ సీసీ రోడ్డు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరం" అని తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పరిష్కారం లభిస్తుంది. శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారంతో ఇల్లందు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా పురపాలక సంఘం నిరంతరం పనిచేస్తుందని వారు పేర్కొన్నారు. అనంతరం స్థానిక పెద్దలు నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రజల సమస్యలను గుర్తించి ప్రతి వార్డులో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు తీసుకువస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఎమ్మెల్యే కోరం కనకయ్య కి వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ బానోత్ రవి నాయక్, వార్డు సలహాదారులు ఎండి మహబూబ్, వార్డు గౌరవాధ్యక్షులు ఎస్‌డీ కాజా మియా, వార్డు అధ్యక్షులు సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ హుస్సేన్, మేకల భిక్షం, నరసయ్య, ఆర్‌పీలు సూర్యకళ, సునీత, మహిళా నాయకురాళ్లు సన్నాయిల సరస్వతి, మద్యాల సరస్వతి, ఆసిఫ్ కలీం, నవాజ్ సాదిక్, దళితరత్న మేకల శ్యామ్ మాదిగ, మలిపెద్ది కమలాకర్, పదం సంతోష్ (చంటి), దొడ్డ బాబీ, వార్డు ఆఫీసర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

---

# మహిమాన్విత చింతగుట్ట గరుడా ఆంజనేయ క్షేత్రాన్ని అభివృద్ధి చేయండి

### వేద పండితులు రామాదాశి శ్రీపాదశర్మ

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 24**

హనుమాన్, గరుత్మంతుని విగ్రహాలు ఒకే రాతిపై వెలసిన మహిమాన్వితమైన చింతగుట్టు హనుమాన్ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని వేద పండితులు రామాదాశి శ్రీపాదశర్మ ఆలయ కమిటీ చైర్మన్ రవీంద్రప్రసాద్ కు సూచించారు. నంగునూరు మండలం తిమ్మాయపల్లి, కోనాయిపల్లి, కొండపాక మండలంలోని బందారం మూడు గ్రామాల శివారులో ని పురాతనమైన గరుడాంజనేయ దేవాలయాన్ని సోమవారం శ్రీపాదశర్మ సందర్శించారు. ఆలయ సమీపంలోని బండపై వెలసిన పాద గుర్తులు, స్వామి వారి విగ్రహాలు, 74 అడుగుల గరుడ, హనుమాన్, నరసింహస్వామి విగ్రహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగమశాస్త్రం ప్రకారం సుమారుగా రెండు వేల సంవత్సరాల కిందట మహానీయులు ఈప్రాంతంలో తపస్సు చేసినట్లుగా తెలుస్తోందన్నారు. చింతచెట్టు కింద స్వామివారు వెలవడంతో చింతగుట్టు హనుమాన్ గా పేరు వచ్చిందని, ఎంతో పవిత్రమైన ఈఆలయానికి ఘన చరిత్ర ఉందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా వెలసిన పురాతన ఆలయ చరిత్రను పరిశీలించి వాస్తవాలు వెలికితీయాలన్నారు. వేదమూర్థులు బ్రహ్మశ్రీ జంద్యాల రాజేశ్వరశాస్త్రి ఆదేశాను సారం అహోరాత్ర సర్ప సూక్త గరుడ మహసూక్త యాగం ఐదు రోజులపాటు సెప్టెంబర్ 3 నుండి 7 వ తేది వరకు ఐదు రోజుల దీక్ష స్వాముల సమక్షంలో నిర్వహిస్తామన్నారు.



---

# క్యాథన్‌పల్లిలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం :

**నారాయణపేట, ఆగస్టు, 24, (అక్షర కలం)**




దామరగిద్ద: నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం క్యాథన్‌పల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో షి టీమ్ పోలీసులు సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత మరియు వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివరం: షి టీమ్ పోలీసులు బాలరాజు, చెనప్ప, కవిత ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వారు ఆడపిల్లలకు ఎలాంటి వేధింపు ఎదురైనప్పటికీ భయపడకమని, వెంటనే షి టీమ్ హెల్ప్‌లైన్ 8712670398కు ఫిర్యాదు చేయాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాలు లేదా ప్రయాణ సమయంలో ఎవరో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ లేదా ఇతర రూపాల్లో వేధిస్తే చేరవేసే ఆపదను తక్షణమే తెలియజేయాలని సంఘటనలో గుర్తుచేశారు.

---

# సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత ;

**--- రైతు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు :**

**నారాయణపేట, ఆగస్టు, 24 (అక్షర కలం)**

కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి, అఖిల భారత రైతు సంఘం (ఎఐకెఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు మరియు సిపిఎం సీనియర్ నాయకుడు, ఆగస్టు 23న హైదరాబాదులోని నీమ్స్ ఆసుపత్రిలో చికిత్సలో ఉన్నపుడు మరణించారు. సిపిఎం నారాయణపేట జిల్లా కార్యదర్శి జి. వెంకట్రామరెడ్డి ఆయన మరణం రైతు, కార్మిక మరియు ప్రజా ఉద్యమాలకు తిరిగి భర్తీ కాని లోటన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు నివాళు లర్పించారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతు సమస్యలపై సారంపల్లి విస్తృత అవగాహనతో పాదయాత్రలు, సదస్సులు, ధర్నాల్లో పాల్గొని ఈ ప్రాంత రైతుల సంక్షేమం కోసం నిరంతరంగా పోరాడిన నేత అన్నారు. శ్రద్ధాంజలిలో బండమీది బలరాం, కె. కాశప్ప, నరహరి, జి. మల్లేష్, పవన్ కుమార్, భాను తదితరులు పాల్గొన్నారు.



---

# ధన్వాడ లో ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ :

**నారాయణపేట, ఆగస్టు, 24, (అక్షర కలం)**

నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఈ విషయమై ప్రజావాణి కి అధ్యక్షత వహించిన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, మండల తాసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట



# తొలి టెస్ట్‌లో ఘోర పరాజయం దిశగా పాకిస్థాన్

## నిప్పులు చెరిగిన ఇంగ్లండ్ జట్టు బౌలర్లు

## పెవిలియన్‌కు క్యూ కట్టిన పాక్ బ్యాటర్లు

ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో పాకిస్థాన్ ఘోర పరాజయం దిశగా సాగుతోంది. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో 238 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్.. 76 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ జట్టు ఇంకా 160 ప్లస్ రన్స్ వెనుకంజలో ఉంది. ఇంగ్లండ్ బౌలర్లు జోష్ టంగ్, జోఫ్రా ఆర్చర్, ఓలీ రాబిన్సన్ నిప్పులు చెరగడంతో పాక్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్లు అజాన్ అవైస్(9), ఇమామ్ ఉల్ హక్(0) తీవ్రంగా నిరాశపర్చగా.. షాన్ మసూద్(29) క్రీజులో నిలబడే ప్రయత్నం చేశాడు. కానీ అతన్ని జోష్ టంచ్ పెవిలియన్ చేర్చాడు. అబ్దుల్లా షఫీక్(15), సౌద్ షకీల్(14), కెప్టెన్ సల్మాన్ అఘా(4) కూడా వెనుదిరగడంతో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో మహమ్మద్ రిజ్వాన్(8 బ్యాటింగ్)తో పాటు అలి ఉస్మాన్(2 బ్యాటింగ్) ఉన్నాడు. మరో సెషన్నర ఆట మిగిలి ఉండగా.. మూడో రోజు ఆటలోనే ఈ మ్యాచ్ ఫలితం తేలనుంది. అదే జరిగితే.. పాకిస్థాన్ ఇన్నింగ్స్ తేడాతో ఓటమి పాలవ్వనుంది. అంతుకుముందు 366/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 409 పరుగుల భారీ స్కోర్ చేసింది. జోర్డాన్ కాక్స్(73), కెప్టెన్ జోరూట్(66), హ్యారీ బ్రూక్(91), డాన్ లారెన్స్ సత్తా చాటారు. పాక్ బౌలర్లలో అలి ఉస్మాన్(5/95) ఐదు వికెట్లు తీయగా.. ఖుర్రమ్ షెహ్‌జాద్(3/133) మూడు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ అలీ తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే కుప్పకూలింది. అబ్దుల్లా షఫీక్(61) హాఫ్ సెంచరీతో రాణించగా.. ఇమామ్ ఉల్ హక్(42) పర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్(5/51), జోష్ టంగ్(5/46) ఐదేసి వికెట్లతో పాకిస్థాన్ పతనాన్ని శాసించారు. గాయంతో బాబర్ ఆజామ్ ఈ మ్యాచ్‌కు దూరమవ్వడంతో పాక్ బ్యాటింగ్ లైనప్ బలహీనంగా మారింది. ఒక్క బ్యాటర్ కూడా క్రీజులో నిలబడలేకపోయాడు. మరోవైపు జో రూట్ అరుదైన ఘనత నమోదు చేశాడు.

# జహీర్ ఖాన్ సలహాతోనే నేను ఓపెనర్‌గా..

టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ విధ్వంసం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రెడ్ బాల్ క్రికెట్‌లో దూకుడుగా ఆడిన తొలి బ్యాటర్ సెహ్వాగ్ అనడంలో కూడా ఎలాంటి అతిశయోక్తి లేదు. 99, 199, 299 పరుగుల వద్ద కూడా సిక్సర్ బాదిన ఏకైక డాషింగ్ బ్యాటర్ సెహ్వాగ్. అయితే కెరీర్ ఆరంభంలో సెహ్వాగ్ లోయర్ మిడిలార్డర్‌లో ఆడేవాడు. ఆ తర్వాత ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అప్పటి కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. సెహ్వాగ్ కోసం తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేశాడని అంతా అనుకుంటారు. కానీ తనను ఓపెనర్‌గా ప్రమోట్ చేసింది గంగూలీ కాదని తాజాగా సెహ్వాగ్ వెల్లడించాడు. పాకిస్థాన్ మాజీ ప్లేయర్ షోయబ్ అక్తర్‌తో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ వీరేంద్ర సెహ్వాగ్ ఈ విషయాన్ని పంచుకున్నాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసే తనను ఓపెనర్‌గా ఆడించాలని గంగూలీకి జహీర్ ఖాన్ చెప్పాడని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. ఓపెనర్‌గా తాను విఫలమైతే జట్టు నుంచి తొలగించవద్దని గంగూలీని తాను వేడుకున్నానని, దానికి అతను హామీ ఇచ్చాడని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. సచిన్ గాయంతో జట్టుకు దూరమవడంతో 2002లో ఇంగ్లండ్‌తో టెస్ట్ మ్యాచ్‌లో సెహ్వాగ్ ఓపెనర్‌గా అరంగేట్రం చేశాడు. తొలి బంతి నుంచే బౌండరీలు బాది టెస్ట్ క్రికెట్‌కు దూకుడు పరిచయం చేసిన సెహ్వాగ్.. 104 టెస్ట్‌ల్లో 23 సెంచరీలు, 32 హాఫ్ సెంచరీలతో 8586 పరుగులు చేశాడు. ఇందులో రెండు ట్రిపుల్ సెంచరీలు ఉన్నాయి. 251 వన్డేలు ఆడిన సెహ్వాగ్ 15 సెంచరీలతో 8273 పరుగులు సాధించాడు. ఇండోర్‌లో జరిగిన మ్యాచ్‌లో అతను 219 పరుగులతో డబుల్ సెంచరీ కూడా సాధించాడు. 2007 టీ20 ప్రపంచకప్ , 2011 వన్డే ప్రపంచకప్‌లను భారత్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. సెహ్వాగ్‌ను ఓపెనర్‌గా ఆడించాలని జహీర్ ఖాన్ ఇచ్చిన సలహా.. భారత జట్టు రాతనే మార్చేసింది.




# క్వార్టర్ ఫైనల్స్‌లో ట్రీసా జాలీ

భారత్?కు తొలి పతకం ఖాయమైంది. భారత స్టార్ ద్వయం ట్రీసా జాలీ– గాయత్రి గోపిచంద్ క్వార్టర్ ఫైనల్?లో విజయం సాధించింది. ఈ జోడి శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌లో ఫైనల్‌లో చైనాకు చెందిన జియా యి ఫాన్, జాంగ్ షు జియాన్‌పై 16–21, 21–15, 21–13 తేడాతో విజయం సాధించింది. దీంతో ట్రీసా–గాయత్రి జోడీకి పతకం (కనీసం కాంస్యం) ఖాయమైంది. ఈ మ్యాచ్? తొలిసెట్లో భారత ద్వయంపై చైనా జోడీ జియా యి ఫాన్, జాంగ్ షు జియాన్?దే ఆధిపత్యంగా సాగింది. ట్రీసా– గాయత్రి పోరాడినప్పటికీ ప్రత్యర్థి జోడీ దూకుడుగా ఆడి తొలి సెట్?ను 21–16తో సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్?లో భారత జోడీ సూపర్ కమ్?బ్యాక్ ఇచ్చింది. ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ధనాధన్ షాట్లతో ఎటాక్?కు దిగింది. మ్యాచ్?లో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన సెట్?ను ట్రీసా– గాయత్రి ద్వయం 21–15తో సొంతం చేసుకుంది. దీంతో మ్యాచ్ ఫలితం కోసం మూడో సెట్? ఆడాల్సి వచ్చింది. అయితే ఇండియన్ షట్లర్లు అదే జోరును ప్రదర్శించారు. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి మూడ సెట్?ను 21–13 భారీ తేడాతో గెలుచుకున్నారు. మొత్తం గంటా తొమ్మిది నిమిషాల పాటు సాగిన ఆటలో 16–21, 21–15, 21–13 తేడాతో విజయం సాధించిన ట్రీసా– గాయత్రి సెమీస్?కు దూసుకెళ్లింది. దీంతో మన షట్లర్లకు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. కాగా, బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్‌లో భారత్ చివరిసారిగా 2011లో పతకం సాధించింది. లండన్ వేదికగా జరిగిన ఆ పోటీలో భారత షట్లర్ జోడీ జ్వాలా గుత్తా – అశ్విని పొన్నప్ప కాంస్య పతకం గెలుచుకుంది. మళ్లీ 15ఏళ్లకు ఈ విభాగంలో భారత్ పతకం అందుకోనుంది. 2022, 2023 సంవత్సరాలలో ట్రీసా – గాయత్రి జోడీ వరుసగా ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. 2022లో కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని కూడా గెలుచుకుంది. గతేడాది ప్రారంభంలో టాప్ 10లోకి ప్రవేశించింది. అయితే, ఈ సంవత్సరం ప్రారంభంలో ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్, ఉబెర్ కప్‌కు ముందు శిక్షణ తీసుకుంటుండగా ట్రీసా చీలమండకు గాయమైంది. ప్రాక్టీస్ చేస్తుండగా ఆమె అనుకోకుండా ఆమె చీలమండ బెణికింది. దీంతో ట్రీసా రిహబిలిటేషన్?కు వెళ్లింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



# సినిమా

CINEMA



# ఇరుముడి ఎమోషనల్ డ్రామా

రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీభోర్సే

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ–సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ–సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి.




# వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ

టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు.




# ఆలేరు తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల దాడులు

## --కొలనుపాక జీపీఓ, ఆర్ఐ లను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

యాదాద్రి భువనగిరి అక్షరకలం

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ పాలన అధికారి అహ్మద్, ఆలేరు తహసిల్దార్ కార్యాలయం ఆర్ఐ పూర్ణచంద్రరావులు రైతు నుంచి లంచం తీసుకుంటుండగా సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే ధర్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన బుడిగె మహేష్ తండ్రి ఉప్పలయ్య గత కొంత కాలం క్రితం మరణించారు. ఉప్పలయ్య పేరుమీద కొలనుపాక రెవెన్యూ పరిధిలో ఉన్న భూమిని తన పేరు మీదకు పౌతీ చేయాలని మహేష్ ఆలేరు తహసిల్దార్ కార్యాలయం లో దరఖాస్తు చేసుకున్నాడు. పలుమార్లు తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పని జరగక పోవడంతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ పూర్ణచంద్రరావు ను కలిశాడు. ఆర్ఐ మరియు కొలనుపాక గ్రామ పాలనాధికారి అహ్మద్ లు 20వేలు లంచం డిమాండ్ చేశారు. చివరకు మహేష్ కు, రెవెన్యూ అధికారులకు మధ్యన 14 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ లోపు మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి విషయాన్ని వివరించారు. సోమవారం 14వేల రూపాయలు కొలనుపాక గ్రామ పాలన అధికారి అహ్మద్ కు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. కొలనుపాక జిపిఓ అహ్మద్, ఆర్ఐ పూర్ణచంద్రరావు లను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు.




# సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మె --తుమ్మల వీరారెడ్డి



అక్షరకలం నల్గొండ

గ్రామపంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం రూ.26,000 కనీస వేతనం వెంటనే అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామాల పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణలో 60 వేల మంది కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నా కనీస వేతనాలు లేక ఆర్థికంగా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని, జిల్లాలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ దీక్షలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి చిన్నపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు లకపాక రాజు, జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, సిఐటియు జిల్లా నాయకులు అద్దంకి నరసింహ, బి గణేష్ యూనియన్ నాయకులు ఎన్ నరసింహ,పి సర్వయ్య, రమేష్, వెంకన్న, ఎ కోటయ్య, సైదులు, బాలమ్మ ,యాదమ్మ వెంకటేశ్వర్లు, శ్రీను నాగయ్య, ఏసు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమక్షంలో జన్మదిన వేడుకలు

అక్షర కలం, చౌటుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నర్రి లింగస్వామి(ఆరోతేజ్),జన్మదిన వేడుకలు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నర్రి లింగస్వామి(ఆరో తేజ్), తో కేక్, కట్ చేయించి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు ఆదర్శంగా,సేవా కార్యక్రమాలలో ముందుంటున్న లింగస్వామి భవిష్యత్తులో మంచి పదవులను పొందాలని ఆశీర్వదించారు.ఈ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్



పార్టీ సీనియర్ నాయకులు, చిమిర్యాల మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి,నర్రి జగదీష్,నర్రి వెంకటేష్,భాతరాజు లాలుప్రసాద్,కార్యకర్తలు,అభిమానులు,తదితరులు,పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ సేవలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలి

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా గ్రామాల్లో విస్తృత అవగాహన

## గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

బ్యాంకులకు సంబంధించిన వివిధ కార్యకలాపాలపై ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం అయన ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఆయా బ్యాంకుల ద్వారా



అందించే సేవలు, బ్యాంకులలో డిపాజిట్, నగదు విత్డ్రా, రుణాల మంజూరు, ప్రభుత్వం ద్వారా అందించే పథకాలకు సంబంధించిన రుణాలు ,ఇతర వివరాలను ఆర్థిక అక్షరాస్యత ద్వారా పొందవచ్చని, ఆర్థిక అక్షరాస్యత వివరాలను తెలియజేసేందుకు జిల్లాలో 9 ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు పనిచేస్తున్నాయని, ఈ కేంద్రాలలో పనిచేసే వారు గ్రామాలకు వెళ్లి ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా ప్రజలకు ఉచిత ఆర్థిక అవగాహన సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ,శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్ .శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, తదితరులు ఉన్నారు.

# సమయపాలన తప్పితే జీతం కట్

## కలెక్టరేట్‌లో ముఖ గుర్తింపు యాప్ అమలు

## అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు ఇకపై ముఖ గుర్తింపు యాప్ ద్వారా హాజరు ఇవ్వాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు తీసుకున్న అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ సమయపాలన, పారదర్శకత బాధ్యతను పెంపొందించడంలో భాగంగా అధికారులు, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండేలా సెప్టెంబర్ 1 నుండి కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్ని కార్యాలయాలలో అధికారి మొదలుకొని ,వాచ్ మెన్ వరకు ముఖ గుర్తింపు హాజరు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అందువలన అన్ని శాఖల ఉద్యోగులందరు ఈ యాప్ లో నమోదు కావాలని, ఇకపై ఈ ఆప్ ఆధారంగానే ఉద్యోగుల జీతాలు, ఇతర బిల్లులను పాస్ చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25న జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల్లో వనమహోత్సవం కింద సామూహికంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. అటవీ, గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ఈ బాధ్యతను చేపట్టి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 60 శాతం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి





చేయడం జరిగిందని, ఈ సంవత్సరం వనమహోత్సవం కింద జిల్లాలో 57 లక్షల 70 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, ఉదయం 10 నుంచి 11 గంటల లోగా ఈ కార్యక్రమం చేపట్టాలని, మండలాల ప్రత్యేక అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల రెండో విడతలో భాగంగా గుడిసెల స్థానంలో ఇండ్లకు గుర్తించిన అర్హులైన లబ్ధిదారుల వివరాలను వారంలో మంజూరు ఇచ్చే విధంగా మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని ప్రతిపాదనలు తెప్పించాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డిని ఆదేశించారు. ఇకపై అన్ని శాఖలు టి- ఫైబర్ నెట్వర్క్ ను ఉపయోగించాలని కలెక్టర్ అన్నారు. ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పరీక్షను ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. ఆర్ సి ఓ లు, జిల్లా కోఆర్డినేటర్లు అన్ని హాస్టల్లో ఖాళీలన్నింటిని భర్తీ చేయాలన్నారు. జిల్లా అధికారులందరూ ప్రతి నెల 5 లోగా టూర్ డైరీలు సమర్పించాలని ఆదేశించారు.పత్రికల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి వివరణ పంపించాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలోని హాస్టళ్లను తనిఖీ చేయాలని, మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్, ఎంపీడీవోలు హాస్టల్లలో విద్య, భోజనం, పరిశుభ్రత పై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వివిధ స్థాయిలలో వచ్చిన ప్రజావాణి దరఖాస్తులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో సీఎం ప్రజావాణి 28, మండల స్థాయిలో 190 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 58, ఇతర శాఖలకు 58, మొత్తం 116 ఫిర్యాదులు స్వీకరించారు.

# శ్రీశైలం -హైదరాబాద్ రహదారిపై ఘోర ప్రమాదం -- ఇద్దరు దుర్మరణం

## --కారు - ద్విచక్రవాహనం ఢీ.. డిండి వద్ద చోటుచేసుకున్న విషాదం.. మరొకరికి తీవ్ర గాయాలు

అక్షరకలం దేవరకొండ



శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. నల్గొండ జిల్లా డిండి మండల కేంద్ర సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా బలంగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితులు హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా డిండి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనంపై ఉన్నవారు రోడ్డుపై పడిపోయి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను నాగరాజు, చంద్రకళగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరొక వ్యక్తిని స్థానికుల సాయంతో వెంటనే అత్యవసర చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# వ్యవసాయం లేదు.. నిబంధనల్లేవు.. కాజేయడమే లక్ష్యం.!

## ఇళ్ల స్థలాల్లో పంటల రికార్డులు.. రూ.89 వేల సర్కారు నిధులు స్వాహా

## ఏఈఓ, లబ్ధిదారులపై విచారణకు ఫిర్యాదు

## వెలుగులోకి నల్గొండ జిల్లా నిడమనూరు మండల ఘనకార్యం

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

ఒకవైపు కొందరు నిజమైన రైతులు సాంకేతిక కారణాలు, పాసుపుస్తకాల సమస్యలతో రైతు బంధు, రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు అందక తలలు పట్టుకుంటుంటే.. మరోవైపు ఎలాంటి పంటలు పండని నివాస ఇళ్లు, ఖాళీ స్థలాల్లో 'వరి, పత్తి' పండినట్లు కాగితాలపై సృష్టించి ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించిన ఉదంతం నల్గొండ జిల్లాలో వెలుగు చూసింది. నిడమనూరు మండలం ఎర్రబెల్లి పరిధిలోని జూలకంటివారిగూడెంలో జరిగిన ఈ అక్రమ వ్యవహారంపై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు గురువారం నిడమనూరు తహసీల్దార్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

### కాగితాల్లో 'వరి-పత్తి'.. క్షేత్రస్థాయిలో నివాస గృహాలు!

ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) ద్వారా సేకరించిన అధికారిక నివేదికల ఆధారంగా ఈ భారీ అక్రమం బయటపడింది. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 276/2/2 (0-09 కుంటలు), 276/4 (0-12 కుంటలు) లోని మొత్తం 0-21 గుంటల భూమిలో ఎలాంటి వ్యవసాయ సాగు జరగడం లేదు. ఇక్కడ 4-154, 4-152, 4-153 ఇంటి నంబర్లతో పక్కా నివాస గృహాలు, ఖాళీ స్థలాలు మాత్రమే ఉన్నాయి.?అయితే, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు, కళ్లముందే ఉన్న ఇళ్లను కప్పిపుచ్చి అక్కడ ఏటా పత్తి, వరి పంటలు సాగవుతున్నట్లు డిజిటల్ రికార్డుల్లో అక్రమ నమోదు చేశారు.

### 40 దఫాలుగా ప్రభుత్వ సొమ్ము కాజేసిన వైనం..

వ్యవసాయ రికార్డుల్లో తప్పుడు సమాచారాన్ని పొందుపరచడం ద్వారా లబ్ధిదారులు లబ్ధి పొందిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. రైతు బంధు/రైతు భరోసా.. 17 విడతల్లో రూ.43,050. పీఎం కిసాన్.. 23 విడతల్లో రూ.46,000 మొత్తం కొల్లగొట్టిన నిధులు.. రూ.89,050. ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా 40 సార్లు ప్రభుత్వ నిధులు ఖాతాల్లో పడుతున్నా వ్యవస్థ పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

### చర్యలకు డిమాండ్..

ఈ అక్రమ లబ్ధి పొందిన వారి తో పాటు పాటు, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా తప్పుడు పంట నివేదికలు నమోదు చేసిన ఏఈఓ (వ్యవసాయ విస్తరణాధికారి) పై సమగ్ర విచారణ జరపాలని మధుబాబు కోరారు. సదరు స్థలాలకు జారీ చేసిన అక్రమ పాసుపుస్తకాలను వెంటనే రద్దు చేసి, వాటిని 'నాలా' కన్వర్షన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇప్పటివరకు అక్రమంగా కాజేసిన రూ.89,050ల ప్రభుత్వ ధనాన్ని బాధ్యుల నుంచి రికవరీ చేసి, శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను డిమాండ్ చేశారు. కాగా ఈ ఘటనతో మండల వ్యాప్తంగా ఉన్న మరికొన్ని సర్వే నంబర్ల నమోదుపై కూడా విచారణ జరపాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# కరువుతో కుదేలవుతున్న నల్లగొండ

-- సాగర్ ఎడమ కాలువ, ఎస్-ఎల్‌బీసీకి వెంటనే నీటిని విడుదల చేయాలి

-- సీపీఐ(ఎం) డిమాండ్

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**




ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరువు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయని, తాగు మరియు సాగునీటి ఎద్దడితో ప్రజలు, రైతాంగం తీవ్ర అల్లాడుతున్నారని సీపీఐ(ఎం) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువతో పాటు ఎస్‌ఎల్‌బీసీకి తక్షణమే నీటిని విడుదల చేసి, మార్గమధ్యంలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను నింపాలి. దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లు పునరుజ్జీవిస్తాయి. ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల నిండిన నేపథ్యంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో మాట్లాడి దిగువకు నీరు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలి. కర్ణాటకలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున డిమాండ్ గట్టిగా వినిపించాలి.
? ప్రాజెక్టులు పూర్తిగా నిండే వరకు వేచి చూడకుండా, వచ్చిన నీటిని దామాషా పద్ధతిలో వినియోగించేలా నిర్ణయం తీసుకోవాలి. కరువు సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, కేంద్రం మరియు కేఆర్ఎంబీ పై ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలి. ? నీటి కొరతను సాకుగా చూపి రైతుల ప్రైవేట్ బోర్లను స్వాధీనం చేసుకుంటామని నోటీసులు ఇవ్వడం, బెదిరించడం సరికాదు. ?ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయకపోతే, రైతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఐ(ఎం) నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారీ ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, వీరపల్లి వెంకటేశ్వర్లు, చిన్నపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# ఆర్టీఐ అమలై తీరాల్సిందే

-బోర్డులు పెట్టండి.. 30 రోజుల్లో సమాచారమివ్వండి

కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి



**అక్షరకలం నల్గొండ**

సమాచార హక్కు చట్టం ( ఆర్టిఐ - 2005)ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎర్రమాద కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు వినతిపత్రంతో పాటు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన సమితి సభ్యులు, ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టం అమలు తీరుపై పలు సూచనలు చేశారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులను ఏర్పాటు చేసి, అందులో సంబంధిత అధికారి పేరు, హోదా, సెల్ నంబర్, కార్యాలయ పూర్తి చిరునామా స్పష్టంగా నమోదు చేయాలి. ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్న పౌరులకు చట్ట ప్రకారం 30 రోజుల్లోగా సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఉద్యోగుల సమయపాలన...**

కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. ప్రజల సౌకర్యార్థం భోజన విరామ సమయాన్ని అందరికీ కనిపించేలా బోర్డులపై ప్రదర్శించాలి. వివిధ పనులపై బయటకు వెళ్లే ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా 'మూమెంట్ రిజిస్టర్'లో తమ వివరాలను నమోదు చేయాలి. ? ఉద్యోగుల వినియోగం కోసం అద్దె వాహనాలను అనుమతించే క్రమంలో, కేవలం అధికారిక టాక్స్ ప్లేట్ అనుమతి కలిగిన వాహనాలనే వాడేలా ఉత్తర్వులు ఇవ్వాలి. జిల్లా పరిధిలోని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు ( పిఐఓ), అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లకు (ఏపీఐఓ ) గ్రీవెన్స్ హాల్ నందు ఒక గంట సేపు ఆర్టీఐ చట్టం-2005పై అవగాహన పెంపు, సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక సదస్సు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోగరి రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు బైరు సైదులు గౌడ్, ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, తిప్పర్తి మండల అధ్యక్షులు గంట కంపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25 నుండి జిల్లాలో 'మాస్ ప్లాంటేషన్'

నాటిన ప్రతి మొక్కా బతకాల్సిందే

అధికారులకు కలెక్టర్ ఆదేశం

వనమహోత్సవంపై మంత్రి కొండా సురేఖ సమీక్ష

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**





వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 నుండి సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి నాటిన ప్రతి మొక్క బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వనమహోత్సవం పై జిల్లా కలెక్టర్లు, అటవీ ,దేవాదాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను వార్డులు, గ్రామాల వారీగా నాటేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించడం అత్యంత ముఖ్యమని, నాటిన ప్రతి మొక్క బతికేలా అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. అంతకుముందు రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున మొక్కలు నాటేందుకు ఉన్న అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలని,ఇందులో భాగంగా వనమహోత్సవం కింద ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టి సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, వన మహోత్సవం ద్వారా అటవీ కవరేజీని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు,ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను , మహిళా సంఘాలు, మున్సిపల్ చైర్మన్లు తదితరులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి టీజీ ఫారెస్ట్ పోర్టల్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని , పట్టణ ప్రాంతాల్లో అటవీ విస్తీర్ణం తక్కువగా ఉన్నందున అక్కడ ఎక్కువగా మొక్కలు నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో విస్తృతంగా పచ్చదనం పెంచాలని ,ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా చర్యలు చేపట్టడంతో పాటు, దేవాలయాల్లో ప్రత్యేకమైన మొక్కలు నాటాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, హాజరయ్యారు.



ఆలేరు తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఆర్ ఐ పూర్ణచంద్రరావు, కొలనుపాక గ్రామ పాలనాధికారి అహ్మద్.

# ఆసుపత్రి కె వైద్యం అందించే దుస్థితి కి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

నేను పోను సర్కార్ దవాఖాన ను అనే రోజులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం

సిద్దిపేట ఆసుపత్రి వైద్య సేవల పై మండి పడ్డ బి ఆర్ ఎస్ నేతలు

**అక్షర కలం సిద్దిపేట ఆగష్టు 24:**



గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో మందికి ఉచిత వైద్య సేవలు అందించిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రినీ ఆసుపత్రికే వైద్యం అందించాల్సిన దుస్థితికి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు పాల సాయిరాం మండిపడ్డారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యం అందడం లేదని నేను రాను బిడ్డో సర్కారు దావకానకు అనే రోజులు మళ్లీ వచ్చాయన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితి అధ్వాన్నంగా మారిందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వారికి కుట్లు వేసేందుకు దారం కూడా ఆస్పత్రిలో ఉండడం లేదని బయట మెడికల్ షాపుల్లో కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. జిల్లా మెడికల్ అడ్వైజరీ కమిటీ మీటింగ్లో మాజీ మంత్రి హరీష్ రావు పలుమార్లు వైద్యశాఖ అధికారులను హెచ్చరించినప్పటికీ వారిలో ఇప్పటికీ మార్పు లేదన్నారు. సరైన సమయంలో వైద్యం అందక రోగులు చనిపోయిన సందర్భాలు కూడా ఇటీవల చూస్తున్నామన్నారు. ఎక్స్రే పరికరాలు, స్కానింగ్, ల్యాబ్ పరికరాలు ఏవి పనిచేయడం లేదని ఆసుపత్రికి వచ్చిన రోగులను ప్రైవేటు ఆసుపత్రికి పంపించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాన్ని మెరుగుపరచాలని లేనిపక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్, మాజీ కౌన్సిలర్లు మోహిజ్, సాయి ఈశ్వర్ గౌడ్,నాయకులు పాపయ్య,నవీన్,హరీష్ పలువురు పాల్గొన్నారు.

# 26 న తిరుమల గిరి లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ .. ఎస్ కృష్ణ వేణి

**తిరుమలగిరి ఆగష్టు 24: (అక్షర కలం)**



తుంగతుర్తి నియోజక వర్గ ప్రజలకోసం ఈ నెల 26న న తిరుమల గిరి లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు కృష్ణవేణి ఫౌండేషన్ చైర్మన్,తెలంగాణ రక్షణ సేన నియోజక వర్గ ఇంచార్జి సూరారపు కృష్ణవేణి తెలిపారు, సింధు హాస్పిటల్ హైటెక్ సిటీ వారి ఆధ్వర్యం లో,కృష్ణవేణి ఫౌండేషన్,శంకరయ్య విజ్ఞాన కేంద్రం తో కలిసి చేస్తున్న హెల్త్ క్యాంప్ లో ప్రముఖ వైద్యుల బృందం క్యాన్సర్, కార్డియాక్, గైనిక్ తదితర సమస్యలతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని అన్నారు తిరుమల గిరి పట్టణం లోనిత్ ఫాతిమా స్కూల్ లో జరిగే హెల్త్ క్యాంప్ నియోజక వర్గం లో ప్రజలందరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు,

# జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేసి, శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి: యు స్ ఫ్ ఐ డిమాండ్

సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట పాలిటెక్నిక్ విద్యార్థులతో ధర్నా

రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు

**అక్షర కలం సిద్దిపేట ఆగష్టు 24:**






రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన శక్తి పాలసీ మరియు టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను విలీనం చేస్తూ జారీ చేసిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు మాట్లాడుతూ సాంకేతిక విద్యా వ్యవస్థను శక్తి పాలసీలో విలీనం చేసి, ఐటిఐలతో కలపడం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు తీవ్ర ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల స్వయం ప్రతిపత్తిని కాపాడాల్సింది పోయి, కేవలం మార్కెట్ ఆధారిత చౌక కార్మిక శక్తిని తయారు చేసే కేంద్రాలుగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా తెచ్చిన జీవో 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి (ఎస్ బి టెట్)ని స్వతంత్ర శాఖగా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# మత్స్యశాఖ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**తుంగతుర్తి ఆగస్టు 24 (అక్షర కలం)**

తుంగతుర్తిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన మత్స్యశాఖ కమిటీని జిల్లా సహకార సంఘం కార్యాలయ అసిస్టెంట్ రిజిస్టర్ కె.పద్మజ అధ్యక్షతన సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మత్స్యశాఖ అధ్యక్షుడిగా రెండోసారి కొండ లింగయ్య, ఉపాధ్యక్షుడిగా అంబటి బుచ్చయ్య,ప్రధాన కార్యదర్శిగా మామిడి నాగరాజులను మెంబర్లుగా మామిడి లింగయ్య, మామిడి నరేష్, దిండి ముత్యాలు కొండ వెంకన్న, సాధు వెంకన్న, అంబటి బుచ్చయ్య ఏకగ్రీవంగా సొసైటీ ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సభ్యులు, నాయకులు కొండ ఎల్లయ్య, కొండ రాజు, కొండా పరుశురాం, సుధాకర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లందకుంట ప్రజావాణికి 13 దరఖాస్తులు

**ఇల్లందకుంట,ఆగస్టు24 ( అక్షర కలం ):**




ఇల్లందకుంట ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 13 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో టి. విజయకుమార్ తెలిపారు. ఎంపీడీవోకు 3, తహసీల్దార్‌కు 4, మండల పంచాయతీ అధికారికి 1, ఏఈ హౌసింగ్‌కు 5 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సకాలంలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
మెదక్ - సంగారెడ్డి - సిద్దిపేట

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యం....

- ప్రజావాణిలో (.55 ) దరఖాస్తుల స్వీకరణ....
- ఇంచార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్...



మెదక్ , ఆగస్టు 24 (అక్షరకలం )

సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను పరిశీలిస్తూ ఆర్జీదారుల సమస్యలను పూర్తిగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి వినతిపై నిర్లక్ష్యం లేకుండా స్పందించి, నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.నేటి ప్రజావాణిలో (55) దరఖాస్తులను అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ స్వీకరించారు.

# అవసరాల మేరకే యూరియా కొనుగోలు చేయాలి.....

- కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి...

కొల్చారం, ఆగస్టు 24(అక్షర కలం)



రైతులు సంయమనం పాటించి అవసరాల మేరకే యూరియాను కొనుగోలు చేయాలని కొల్చారం మండలం వ్యవసాయ అధికారి ఏఓ ఎం. శ్వేతా కుమారి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కొత్తగా వచ్చిన ఈ యాప్ ప్రారంభ దశలో ఉన్నందువల్ల కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయని, ప్రస్తుతం వాటిని పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. రైతులు తమకు అవసరమైన మేరకే యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు అవసరాలకు మించి ఎక్కువగా ఎరువులను కొనుగోలు చేయడం వల్ల కొంతమంది రైతులకు ఎరువుల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు రబీ సీజన్ కోసం ముందుగానే యూరియాను నిల్వ చేసుకోకుండా ప్రస్తుత పంట అవసరాల మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. కొల్చారం మండలంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎరువుల సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఏఓ ఎం. శ్వేతా కుమారి పేర్కొన్నారు.

# మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి....

- క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై సమీక్షా సమావేశం....
- క్రిటికల్ కేర్ బ్లాక్ ను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ....

మెదక్, ఆగస్టు 24(అక్షర కలం)

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ మెదక్ జిల్లా కేంద్రం లోని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ ను స్థానిక శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారితో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై జి జి హెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సునీత దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా నితిన్ కబ్రా, డి ఎం హెచ్ ఓ డా. జ్ఞానేశ్వర్, డి సి హెచ్ ఎస్ డా. శివ దయాళ్, వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష లో పీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హనుమంత రావు గార్లు పాల్గొన్నారు.
క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన హెచ్ ఆర్ ఎక్విప్మెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఐ హెచ్ ఎఫ్ ఎం ఎస్ సేవలను అందుబాటులోకి తేవడం పై రేపు (ఖ్వ. 25.08.2026) న హైదరాబాద్ సచివాలయం లో ఉన్నత స్థాయి సమావేశం కు రావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అలాగే, జి జి హెచ్ ఆసుపత్రి లో వైద్య సేవల బలోపేతం పై మంత్రి చర్చించారు. జి జి హెచ్ నూతన భవన నిర్మాణం పై చర్చించారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం పై చర్చించారు. తూప్రాన్ లో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో నర్సాపూర్,రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ లలో కిడ్నీ రోగులకు అందిస్తున్న డయాలసిస్ సేవలపై చర్చించారు. మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.



# వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి....

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.....
- జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించాలి....
- మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక దృష్టి సారించాలి.....
- మెదక్ జిల్లాలో .31 లక్షల 95 వేల లక్ష్యానికి, 19 లక్షల 43వేల 654 మొక్కల నాటి 60.83 %శాతం లక్ష్యం పూర్తి......

మెదక్, ఆగస్టు 24(అక్షర కలం)

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ డీ ఎఫ్ ఓ జో.జి తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను



నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైన మొక్కలను



సకాలంలో తరలించాలని సూచించారు.అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు.

- మెదక్ జిల్లాలో.60. 83%శాతం లక్ష్యం పూర్తి....

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో వన మహోత్సవం కింద 31 లక్షల 95 మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు .19 లక్షల 43వేల 654 మొక్కలు నాటి .60.83 %.శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు.మంత్రి సూచనల మేరకు రేపు జిల్లావ్యాప్తంగా భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి, జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి ఫ్ ఓ జో జి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన....- కలెక్టర్ ప్రతిమాసింగ్....

మెదక్,ఆగస్టు 24 (అక్షర కలం)

రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా, ప్రజల కష్టాలను, ప్రాణ నష్టాన్ని మరియు ఆస్తి నష్టాన్ని నివారించడానికి మీ మీ గ్రామ పంచాయతీ పురపాలక పరిధిలో తక్షణ ముందస్తు మరియు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్.తెలిపారు వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మెదక్ జిల్లా ఎల్లో అలర్ట్ లో ఉందన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ కలెక్టర్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారురోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, ఇరిగేషన్, విద్యుత్, జిల్లా పంచాయతీ , వైద్య ఆరోగ్య శాఖ , ఆర్డీవోలు,తాసిల్దారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలమైన మరియు అసురక్షితమైన భవనాలు పాత నిర్మాణపరంగా బలహీనమైన భవనాలను తక్షణమే



భౌతికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.ప్రమాదకరమైన నిర్మాణాలలో నివసిస్తున్న వారికి వెంటనే ఖాళీ చేయమని నోటీసులు జారీ చేయాలన్నారు. తాత్కాలిక సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

- డ్రైనేజీ మరియు నీటి నిల్వ....

అన్ని తుఫాను నీటి కాలువలు, ప్రధాన కల్వర్టులు మరియు ఫీడర్ ఛానెల్ల నుండి పూడిక, చెత్త మరియు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని, లోతట్టు ప్రాంతాలలో మరియు నీరు నిలిచిపోయే హాట్‌స్పాట్‌లుగా తెలిసిన ప్రదేశాలలో భారీ సామర్థ్యం గల డీవాటరింగ్ పంపులను అమర్చాలని తెలిపారు.
- వ్యాధి వానాకాల ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణ....
దోమల సంతానోత్పత్తిని అరికట్టడానికి మరియు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల వ్యాప్తిని నివారించడానికి, క్రమం తప్పకుండా యాంటీ-లార్వల్ చికిత్సలు, స్పేస్ స్ప్రేయింగ్ మరియు నిలిచి ఉన్న నీరు గల ప్రాంతాలలో ఫాగింగ్ చేపట్టాలన్నారు.
- త్రాగునీటి భద్రత మరియు పారిశుధ్యం.....
మురుగునీటి లీకేజీ వలన కలిగే కాలుష్యాన్ని నివారించడానికి మున్సిపల్ నీటి సరఫరాలను క్రమం తప్పకుండా పరీక్షించాలన్నారు.నిరంతర క్లోరినేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలని బలహీన వర్గాల కోసం తగినన్ని నీటి శుద్ధి మాత్రలను నిల్వ ఉంచుకోవాలన్నారు.రహదారి భద్రత మరియు గుంతల మరమ్మతులు: వాహనాలు మరియు పాదచారుల సురక్షిత రాకపోకలను నిర్ధారించడానికి, పెద్ద గుంతలను పూడ్చే విధంగా చూడాలన్నారు., తెరిచి ఉన్న నిర్మాణ గుంతలు, వరద నీటితో నిండిన రోడ్లు మరియు మ్యాన్‌హోల్‌ల చుట్టూ స్పష్టమైన హెచ్చరిక సూచికలు లేదా బారికేడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పడిపోయిన చెట్లు లేదా శిథిలాలను వెంటనే తొలగించేల చర్యలు చేపట్టాలన్నారు.
- విద్యుత్ మరియు మౌలిక సదుపాయాల భద్రత....
విద్యుత్ మౌలిక సదుపాయాలు భద్రత దృష్టిలో ఉంచుకొని విద్యుదాఘాత ప్రమాదాలను నివారించడానికి, తెరిచి ఉన్న జంక్షన్ బాక్సులు, వదులుగా ఉన్న ఓవర్‌హెడ్ వైరింగ్ మరియు నీటితో నిండిన వీధుల్లోని విద్యుత్ స్తంభాలను తనిఖీ చేసేందుకు విద్యుత్ శాఖ సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజా భద్రతను నిర్ధారించి, పట్టణ అంతరాయాలను తగ్గించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హైమావతి

అక్షర కలం సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 24 :

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల వినతులను జిల్లా



అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం విచ్చేసిన ప్రజల నుండి మొత్తం 90 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, ఎస్డిసి సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులు పాల్గొన్నారు

# జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ప్రణవ్

హుజూరాబాద్, ఆగస్టు24 ( అక్షర కలం ):

ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ అంబేద్కర్ కూడలిలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు.జర్నలిస్టుల ఇళ్ల పట్టాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సహకరిస్తామని ప్రణవ్ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఇచ్చిన పట్టాల విషయంలో భవిష్యత్‌లో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955




# ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణికి 66 ఫిర్యాదులు.**

**జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్**

గద్వాల్ అక్షర కలం ప్రతినిధి



ప్రజావాణిలో అందిన ఆర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి ప్రజల నుంచి మొత్తం 66 ఆర్జీలను స్వీకరించారు.ప్రజలు సమర్పించిన దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రజావాణి ఆర్జీలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా అధికారులు మండల స్థాయిలో ప్రజావాణి ఆర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని,మండల అధికారుల నుంచి ప్రతి వారం ఆర్జీల పరిష్కారంపై నివేదికలు తీసుకుని సమీక్షించాలని ఆదేశించారు.ఆర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.జిల్లాకు సంబంధించిన సెన్సస్ నివేదికలను సంబంధిత శాఖలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఒక లబ్ధిదారునికి అదనపు కలెక్టర్ ట్రైసైకిల్‌ను అందజేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటి కలెక్టర్లు రాజ్ కుమార్,మనోజ్ కుమార్ రెడ్డి, ఏ.ఓ మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది,తదితరులు

## ఎల్కూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ఇచ్చిన సర్పంచ్ పి. వినోద్ కుమార్



గద్వాల్ అక్షర కలం ప్రతినిధి

ఎల్కూర్: గద్వాల్ ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎల్కూర్ గ్రామంలో కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం మార్కింగ్ కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సుభావతి ఆధ్వర్యంలో మంజూరైన ఇళ్ల స్థలాలను పరిశీలించి లబ్ధిదారులకు మార్కింగ్ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు తమను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణ పథకం ద్వారా తమ సొంత ఇంటి కల నెరవేరుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఫీజుల బకాయి--బీజేపీ లడాయి.




గద్వాల్ టౌన్ అక్షరకలం:

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సూచనలతో గద్వాల పట్టణంలో ఆదివారం 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంఏఎల్‌డీ కళాశాల నుంచి కృష్ణవేణి చౌక్, రాజీవ్ మార్గ్, పాత బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కళాశాలల యాజమాన్యాలు కూడా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని పేర్కొన్నారు.విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో బకాయిలను విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రభుత్వం స్పందించే వరకు ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ఎక్బోటే, శ్యామ్‌రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కిష్టన్న, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహులు, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, మండల అధ్యక్షులు తిరుపతి రెడ్డి, శ్రీనివాసులు, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకే లే అవుట్లకు అనుమతులు జారీ-----జిల్లా కలెక్టర్ ప్రియాంక.

నారాయణపేట, ఆగస్టు,24( అక్షర కలం)

ప్రభుత్వ నిబంధనలను అనుసరించి లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా లే అవుట్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లే అవుట్ల అనుమతుల జారీ విషయంలో అధికారులు అన్ని నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి స్థాయి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కమిటీ పరిశీలనకు వచ్చిన జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన 6 లే అవుట్ దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారుల క్లియరెన్స్ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.కమిటీ పరిశీలన అనంతరం 3 లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయగా, మరో 3 లే అవుట్ల దరఖాస్తులను తిరస్కరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...లే అవుట్ అనుమతుల జారీ ప్రక్రియలో ఆన్‌లైన్ విధానం తీసుకురావడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ప్రక్రియను సులభతరం చేయడం, సమయాన్ని తగ్గించడం, అనవసరమైన భౌతిక సమావేశాలను నివారించడమేనని కలెక్టర్ తెలిపారు.ఆన్‌లైన్‌లో పరిశీలన పూర్తయిన తర్వాత కూడా ప్రతి దరఖాస్తుకు మళ్లీ భౌతిక సమావేశం నిర్వహిస్తే ప్రక్రియ రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ వెరిఫికేషన్ సమయంలో ఏదైనా అధికారి లేదా కమిటీ సభ్యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తే, ఆ అభ్యంతరాన్ని సిస్టమ్‌లోనే నమోదు చేసే విధానం ఉండాలని సూచించారు.అభ్యంతరం నమోదైన సందర్భంలో సంబంధిత ఫైల్‌ను తదుపరి స్థాయికి ఆటోమేటిక్‌గా పంపించేలా ప్రక్రియను రూపొందించవచ్చని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఆమోదించిన దరఖాస్తులకు మళ్లీ ప్రత్యేకంగా భౌతిక సమావేశం నిర్వహించాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లోనే తదుపరి ప్రక్రియకు ఫైల్‌ను పంపించే విధానం అమలు చేస్తే సమయం, శ్రమ రెండూ ఆదా అవుతాయని స్పష్టం చేశారు.



## పాఠశాల తనిఖీకి వచ్చి సోషల్ పాఠం చెప్పిన కలెక్టర్

**బల్మూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'సోషల్ టీచర్'గా మారిన హేమంత కేశవ్ పాటీల్**

అక్షర కలం నాగర్ కర్నూల్ ప్రతినిధి:-



పాఠశాల తనిఖీకి వచ్చిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ కాసేపు 'సోషల్ టీచర్'గా మారి విద్యార్థులకు పాఠం బోధించారు. అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని బల్మూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ 8వ తరగతి గదిలోకి వెళ్లి సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలపై వారిని ప్రశ్నిస్తూ, స్వయంగా బోర్డుపై అక్షాంశాలు, రేఖాంశాలు,భూమధ్యరేఖను వివరిస్తూ పాఠం చెప్పారు.పాఠశాలకు ఆకస్మికంగా చేరుకున్న జిల్లా కలెక్టర్ ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు నమోదును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పరిస్థితి, ఉపాధ్యాయుల హాజరు, తరగతుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం రోజువారిగా అందించాలని సూచించారు.అనంతరం 8వ తరగతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా సంభాషించారు. సాంఘిక శాస్త్రం పాఠ్యాంశానికి సంబంధించిన భూమధ్యరేఖ భారతదేశంలో ఎడారులు ఏర్పడేందుకు కారణాలపై పలు ప్రశ్నలను విద్యార్థులను అడిగి వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు.విద్యార్థులు చెప్పిన సమాధానాలను ఆసక్తిగా విన్న కలెక్టర్, పాఠ్యాంశాలను ఎంతవరకు అర్థం చేసుకున్నారో స్వయంగా పరిశీలించారు.

అక్షాంశాలు, రేఖాంశాలు అంటే ఏమిటి? భూమధ్యరేఖ ప్రాధాన్యత ఏమిటి? భూమిపై వివిధ ప్రాంతాలను గుర్తించడంలో వీటి ఉపయోగం ఏమిటి? వంటి అంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు సమాధానాలు చెప్పేలా ప్రోత్సహిస్తూ, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

విద్యార్థులకు అంశాలు మరింత స్పష్టంగా అర్థమయ్యేలా జిల్లా కలెక్టర్ స్వయంగా బోర్డు ముందుకు వెళ్లారు. బోర్డుపై అక్షాంశాలు, రేఖాంశాలు, భూమధ్యరేఖను రాస్తూ వాటి ప్రాముఖ్యతను వివరించారు.పాఠ్యపుస్తకంలోని అంశాలను కేవలం చదివి గుర్తుంచుకోవడం కాకుండా, వాటి వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

భూమధ్యరేఖకు సంబంధించిన అంశాలను సులభమైన రీతిలో వివరిస్తూ, అక్షాంశాలు, రేఖాంశాల ద్వారా భూమిపై ప్రాంతాలను ఎలా గుర్తించవచ్చో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ స్వయంగా బోర్డుపై పాఠం బోధించడంతో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఆయన చెప్పిన విషయాలను విన్నారు. భూమధ్యరేఖ, అక్షాంశాలు, రేఖాంశాలపై ప్రతి విద్యార్థికి పూర్తి స్థాయి అవగాహన ఉండాలని కలెక్టర్ సూచించారు. తరగతిలో కొంతమంది విద్యార్థులకు మాత్రమే పాఠ్యాంశం అర్థమయ్యేలా కాకుండా, ప్రతి విద్యార్థి విషయాన్ని పూర్తిగా గ్రహించేలా బోధన సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థులను తరచూ ప్రశ్నించడం ద్వారా వారి అభ్యసన స్థాయిని అంచనా వేయాలని, చదువులో వెనుకబడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని అన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడంతో పాటు, పాఠ్యాంశాలపై ఆసక్తి కలిగించేలా బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, విద్యార్థుల హాజరుతో పాటు వారి అభ్యసన ఫలితాలపై కూడా నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, వాటిని దైనందిన జీవితానికి అన్వయిస్తూ బోధిస్తే విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం మరింత పెరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్పేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.జిల్లా కలెక్టర్ స్వయంగా తరగతి గదిలోకి వచ్చి విద్యార్థులతో మాట్లాడటమే కాకుండా బోర్డుపై పాఠం బోధించడంతో విద్యార్థుల్లో ఉత్సాహం నెలకొంది. సాధారణంగా తనిఖీ సమయంలో అధికారికంగా పాఠశాల పరిస్థితులను పరిశీలించే కలెక్టర్, ఈసారి విద్యార్థులతో కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మమేకమై పాఠ్యాంశాన్ని వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు రజాక్ తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు తరగతి గదిలోనే ప్రశ్నలు అడిగి, అవసరమైన చోట స్వయంగా వివరణ ఇవ్వడం ద్వారా విద్యపై తనకున్న ప్రాధాన్యతను కలెక్టర్ చాటుకున్నరని ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు తెలిపారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి ప్రగతిని వ్యక్తిగతంగా పరిశీలిస్తూ, అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. విద్యార్థులలో పాఠశాల పట్ల ఆసక్తి, చదువుపట్ల శ్రద్ధ పెంచే వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, తాహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రజాక్ తదితరులు ఉన్నారు.

## మహిళలు ఒంటరివారు కాదు. సమస్య వచ్చినప్పుడు సఖి అండగా ఉంది

గద్వాల్ టౌన్ అక్షరకలం:

జోగులాంబ గద్వాల,మహిళలు ఎదుర్కొనే గృహహింస, కుటుంబ కలహాలు, వేధింపులు, న్యాయపరమైన సమస్యలు, అసురక్షిత పరిస్థితులు వంటి క్లిష్ట సందర్భాల్లో వారికి తక్షణ సహాయం, భద్రత, భరోసా కల్పించడంలో సఖి వన్ స్టాప్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తోంది. సమస్య ఏదైనా బాధిత మహిళ ఒంటరిగా పోరాడాల్సిన అవసరం లేకుండా, అవసరమైన వివిధ సేవలను ఒకే వేదికపై అందిస్తూ సఖి కేంద్రం అండగా నిలుస్తోంది.

ఆపదలో 181.. తొలి సహాయక అడుగు

ఆపదలో ఉన్న మహిళలకు 181 మహిళా హెల్ప్‌లైన్ ఒక ముఖ్యమైన సహాయక వేదికగా పనిచేస్తోంది. మహిళలు తమ సమస్యను హెల్ప్‌లైన్‌కు తెలియజేసిన వెంటనే పరిస్థితిని అర్థం చేసుకుని అవసరమైన సహాయం అందించే దిశగా చర్యలు చేపడతారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైనప్పుడు బాధిత మహిళను రెస్క్యూ చేసి సురక్షిత ప్రదేశానికి తరలిస్తారు.ఒక ఫోన్ కాల్‌తో ప్రారంభమయ్యే సహాయం.. బాధిత మహిళకు భద్రత, భరోసా కల్పించే వరకు కొనసాగడమే ఈ సేవల ప్రత్యేకత.

రెస్క్యూ నుంచి సురక్షిత తాత్కాలిక వసతి వరకు..

అసురక్షిత పరిస్థితుల్లో ఉన్న మహిళలను అవసరాన్ని బట్టి సఖి




వన్ స్టాప్ సెంటర్‌కు తీసుకువచ్చి తాత్కాలిక సురక్షిత వసతి కల్పిస్తారు. వెంటనే కుటుంబానికి తిరిగి వెళ్లలేని మహిళలకు సురక్షిత వాతావరణంతో పాటు వసతి, భోజనం, ఇతర ప్రాథమిక సదుపాయాలు అందిస్తారు.ఈ సమయంలో బాధిత మహిళకు కౌన్సెలింగ్, వైద్య సేవలు, న్యాయ సహాయం వంటి అవసరమైన సేవలను సమన్వయంతో అందిస్తూ ఆమె భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు.

**ఒకే వేదికపై సమగ్ర సేవలు**

సఖి వన్ స్టాప్ సెంటర్ ప్రత్యేకత ఏమిటంటే బాధిత మహిళ తన సమస్య పరిష్కారం కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అవసరమైన అనేక సేవలను ఒకే వేదికపై పొందే అవకాశం కల్పించడం.కౌన్సెలింగ్: బాధిత మహిళల సమస్యలను ఓపికగా విని, వారి పరిస్థితిని అర్థం చేసుకుని సైకో సోషల్ కౌన్సెలర్ మానసిక, సామాజిక సహాయం అందిస్తారు. క్లిష్ట పరిస్థితుల్లో వారికి ధైర్యం, ఆత్మవిశ్వాసం కల్పిస్తూ సమస్యను ఎదుర్కొనేలా ప్రోత్సహిస్తారు.న్యాయ సహాయం: లీగల్ కౌన్సెలర్ బాధిత మహిళలకు కేసులకు సంబంధించిన న్యాయపరమైన సలహాలు, మార్గదర్శకత్వం అందిస్తారు. అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకుంటారు.

వైద్య సేవలు: అవసరమైన ప్రాథమిక వైద్య సహాయాన్ని పారామెడికల్ సిబ్బంది అందిస్తారు. తదుపరి చికిత్స అవసరమైతే సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేసి వైద్య సేవలు అందేలా సమన్వయం చేస్తారు.

**ప్రతి సిబ్బంది.. ప్రత్యేక బాధ్యత**

సఖి కేంద్రం సమర్థవంతంగా పనిచేయడంలో ప్రతి సిబ్బంది పాత్ర ఎంతో కీలకం. సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కేంద్రం మొత్తం పరిపాలన, సిబ్బంది సమన్వయం, రికార్డులు, రిజిస్టర్లు, నివేదికలు, రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు.కేస్ వర్కర్ కేంద్రానికి వచ్చిన కేసును స్వీకరించి బాధిత మహిళతో మాట్లాడి సమస్యను పూర్తిగా తెలుసుకుంటారు. ఆమెకు అవసరమైన సేవలను గుర్తించి సంబంధిత సిబ్బందితో సమన్వయం చేస్తారు.సైకో సోషల్ కౌన్సెలర్ మానసిక, సామాజిక సహాయం అందిస్తూ బాధితురాలిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తారు. లీగల్ కౌన్సెలర్ న్యాయపరమైన మార్గదర్శకత్వం అందిస్తారు. పారామెడికల్ సిబ్బంది మహిళ ఆరోగ్య పరిస్థితిపై శ్రద్ధ తీసుకుంటారు. ఐటీ సిబ్బంది కేసుల నమోదు, డేటా ఎంట్రీ, సంబంధిత డ్యాష్‌బోర్డుల్లో వివరాల నమోదు వంటి సాంకేతిక కార్యకలాపాలను నిర్వహిస్తారు.

## సంగాలలో ఉచిత కంటి పరీక్షల శిబిరం

గద్వాల్ అక్షర కలం ప్రతినిధి

సంగాల గద్వాల మండలం సంగాల గ్రామంలో కందూరు రామిరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ జోగులాంబ గద్వాల జిల్లా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సంగాల గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దల సహకారంతో సోమవారం ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు.

సంగాల గ్రామంలోని కీ.శే. చెట్టుకింది పార్వతమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ శిబిరానికి సంగాలతో పాటు జిల్లెడు బండ, మర్లపల్లి, గోనుపాడు, శెట్టిఆత్మకూరు, మదనపల్లి తదితర పరిసర గ్రామాల నుంచి కంటి సమస్యలతో బాధపడుతున్న సుమారు 150 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం 30 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందించేందుకు ఏర్పాటు చేశారు. కంటి సమస్యలు అధికంగా ఉన్న 25 మందిని శస్త్రచికిత్స కోసం గుర్తించి, మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండలోని కందూరు రామిరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. వారికి రేపు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీ కృష్ణయ్య, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నళిని, కార్యదర్శి కే. శ్రీహరి, కోశాధికారి టి. తాయన్న, లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీ అయ్యపురెడ్డి, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీ మోహన్‌రావు, బోర్డు సభ్యులు డాక్టర్ మహేష్, బషీర్ అహమ్మద్, లయన్ శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు. అలాగే సంగాల గ్రామ సర్పంచ్ కే. రాజశేఖర్, జిల్లెడు బండ సర్పంచ్ బి. నగేష్, మదనపల్లి సర్పంచ్ శ్రీ సంజీవులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కంటి పరీక్షల శిబిరానికి హాజరైన వారికి అవసరమైన వసతులను శ్రీ అయ్యపురెడ్డి, సంగాల సర్పంచ్ కే. రాజశేఖర్ ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి భోజన సౌకర్యాన్ని సంగాలలోని నోబుల్ ఉన్నత పాఠశాల (జదీూజు) డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు, కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు అందించడం అభినందనీయమని గ్రామస్థులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# అర్హులందరికీ చేయూత పింఛన్లు

కరీంనగర్, ఆగస్టు24 ( అక్షర కలం ):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేయూత అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఓగులాపూర్‌లో నిర్వహించిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు.అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితరులకు చేయూత పింఛన్లు అందిస్తామని తెలిపారు. ఇల్లు లేని అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తోటపల్లి రిజర్వాయర్ కోసం గతంలో సేకరించిన భూముల అంశంపై రైతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, ముంపు భూముల్లో పండించిన




ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తామన్నారు.రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలని, గ్రామ అవసరాల మేరకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం మొక్కలు నాటి, విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి



కరీంనగర్, ఆగస్టు24 ( అక్షర కలం ):

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్ఓ స్వామితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 193 దరఖాస్తులు అందగా, అత్యధికంగా నగరపాలక సంస్థకు 58, గృహ నిర్మాణ శాఖకు 42 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లాగిన్‌లో అప్‌డేట్ చేయాలని కలెక్టర్ సూచిం చారు. సమస్యలు క్లిష్టంగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు.

## వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలి



కరీంనగర్,ఆగస్టు24 ( అక్షర కలం) :

వన మహోత్సవంలో జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వన మహోత్సవంపై సమీక్షించారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు మంత్రి తెలిపారు. వర్షాలు అనుకూలంగా ఉన్నందున భారీగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణానికి లక్ష్యాలు నిర్దేశించి సామూహికంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ, మనుగడపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలని తెలిపారు. పాఠశాలలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కరీంనగర్ నుంచి అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీఓ గీత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించినట్టు ఆటో కార్మికులకు 12000 ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ..

జగిత్యాల ఆగస్టు 24 ( అక్షర కలం )

రాష్ట్ర వ్యాప్తంగా ఆటో జేఏసీ ఇచ్చిన బందుకు పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రతిరోజు ధరలు విపరితంగా పెరుగుతున్నాయి అని గత 40 సంవత్సరాలు గా ఆటో నడుపుతూ జీవిస్తున్నామని ఆటో కార్మికులకు అనారోగ్య సమస్యలుఎదురవుతున్నాయి ని అంతేకాకుండా వారి పిల్లలకు సరైన విద్య మరియు వైద్యం




అందడం లేదాని చాలామందికి కనీసం డబుల్ బెడ్ రూమ్ లో ఇల్లు కూడా రాలేదని ఇంకా అనేక రకాల సమస్యలు ఉన్నాయి.. వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని. ఆటో కార్మికులకు 12,000 ఆర్థిక సహాయం చేస్తామని ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొంది. దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు

## మేదర కులస్తులకు ఆసరా పింఛన్ వర్తింప చేయాలి



రాయికల్ ఆగస్టు 24(అక్షర కలం):

తరతరాలుగా వెదురు వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న మేదర (మహేంద్ర) కులం నేడు అస్తిత్వ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని,ప్లాస్టిక్ దెబ్బకు వృత్తి కుదేలవ్వడంతో పూట గడవడమే భారంగా మారిందని, ప్రభుత్వం ఆసరా పింఛన్ వర్తింపజేసి ఆదుకోవాలని రాయికల్ మండల మహేంద్ర సంఘం అధ్యక్షులు సిలివేరి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో నోడల్ అధికారి,ఎంపీడీవో బింగి చిరంజీవికి ఆయన వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేము బీసీ-ఏ కేటగిరీలో అత్యంత వెనుకబడిన వారమని,మా తాత ముత్తాతల కాలం నుండి వెదురుతో బుట్టలు, గంపలు, చాటలు, తడకలు, పండుగలకు కావాల్సిన అలంకరణ సామాగ్రి తయారు చేస్తూ, వాటిని నెత్తిన పెట్టుకొని గ్రామ గ్రామాన తిరుగుతూ అమ్ముకుంటూ జీవిస్తున్నామని అన్నారు. ఇది కేవలం వృత్తి కాదు, పర్యావరణాన్ని కాపాడే చేతి వృత్తి అని,కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, మార్కెట్లోకి ప్లాస్టిక్, స్టీల్, ఫైబర్ వస్తువులు వచ్చాక మా చేతితో చేసిన వస్తువులను ఎవరూ కొనడం లేదని, నేడు రోజుకు రూ.100-150 కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పైగా అటవీ చట్టాలు కఠినతరం కావడంతో వెదురు కోసం 15-20 కిలోమీటర్లు అడవిలోకి కాలినడకన వెళ్లాలని,అటవీ అధికారుల భయం ఒకవైపు, వయసు పైబడిన వృద్ధులు ఆ బరువును మోసుకురావడం మరోవైపు నరకంగా మారిందని వాపోయారు.మాలో 45 ఏళ్లు దాటిన వారెవరూ కష్టం చేసే స్థితిలో లేరని,వికలాంగులు, ఒంటరి మహిళల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని, పిల్లల చదువులు,ఆస్పత్రి ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోందని,రాష్ట్ర ప్రభుత్వం గౌడన్నలకు, చేనేత సోదరులకు 50 ఏళ్లకే రూ.2016 ఆసరా పింఛన్ ఇచ్చి ఆదుకుంటోందని, అదే తరహాలో కనుమరుగవుతున్న మా మేదర కుల వృత్తిని కూడా గుర్తించి, మాకు కూడా ఆసరా పింఛన్ వర్తింపజేయాలి" అని ఆయన కోరారు.తమ వినతిని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శనిగరపు రాజనర్సయ్య, ప్రమోద్, రంజిత్, చింత రాజేశం, నర్సయ్య, సిలివేరి ప్రశాంత్, శ్రీనివాస్,పిల్లి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజక వర్గ ఇంచార్జ్ శ్రావణి కి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి పట్టణ నాయకులు...

రాయికల్ ఆగస్టు 24(అక్షర కలం):



బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ భోగ శ్రావణి జన్మదిన సందర్భంగా రాయికల్ పట్టణ బిజెపి అధ్యక్షులు,కౌన్సిలర్లు,నాయకులు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం శాలువాతో శ్రావణి నీ సత్కరించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం లో బిజెపి పార్టీ బలోపేతంకు అహర్నిశలు కృషి చేస్తున్న శ్రావణి,రానున్న రోజుల్లో ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కురుమ మల్లారెడ్డి,ప్రధాన కార్యదర్శి కూనారపు భూమేష్,పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ పుర్రె శ్రీధర్,నాయకులు వేముల రాము,తోపారపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం ఆకస్మికం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల ఆగస్టు 24 (అక్షర కలం)

సోమవారం జగిత్యాల రూరల్ మండలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రజల నుండి అందుతున్న వినతులు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉదేశ్యం తో గత వారం నుండి మండల స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని, శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమా దేవి, తహసీల్దార్ హకీమ్, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.




అక్షరకలం
తెలుగు దినపత్రిక
కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్న సిరిసిల్ల

## 11 కెవి విద్యుత్ లైన్ ప్రమాదం:

- కాలనీ నివాసితులు ప్రజావాణిలో దరఖాస్తు :




నారాయణపేట, ఆగస్టు 24 (అక్షర కలం)

నారాయణపేట: మరికల్ మండలం ఎస్సీ కాలనీ నివాసులు 11 కెవి విద్యుత్ లైన్ వారి ప్రాణాభంగానికి కారణమయ్యే విదంగా ఉన్నదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు, ఇళ్లకు మరియు పక్కనున్న వ్యవసాయ భూములకు చాలా సమీపంలో గుండా వెళ్తున్న ఈ లైన్ తక్కువ ఎత్తులో ఉండటంతో గాలి, వర్షాల సమయంలో తారలు దిగే, షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదం భారీగా ఉంది, అంటున్నారు స్థానికులు. స్థానిక నేతలు జోగు రామస్వామి, సీమ బాలకృష్ణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గూప్ నర్సిములు, ధన్వాడ మండల్ అధ్యక్షుడు కలూరు నర్సిములు, సీమ కమల్ కుమార్, సీమ శ్రీనివాసులు, గల్ప్ కుర్మయ్య తదితరులు ఈ సమస్యను తెలియజేశారు. వారు మరికల్ మండల ఎంపీడీఓ కార్యాలయానికి ప్రజావాణి వినతిపత్రం ద్వారా స్పందన కోరగా, విద్యుత్ శాఖను సంబంధించిన అధికారుల్ని ఆదేశించి తక్షణమే సర్వే నిర్వహించి లైన్‌ను సురక్షిత మార్గానికి స్థానచలనం చేయాలని డిమాండ్ చేశారు.

## 27న గ్రామ, వార్డు సభలు నిర్వహించాలి



కరీంనగర్, ఆగస్టు24 ( అక్షర కలం ):

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. కరీంనగర్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చిత్రా మిశ్రా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితా, ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితాలను గ్రామ, వార్డు సభల్లో చదివి వినిపించాలని సూచించారు. బీఎల్ఓలు ఫారం-6, 7, 8 అందుబాటులో ఉంచి ప్రజల అభ్యంతరాలను నమోదు చేయాలని తెలిపారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

## మడిపల్లి, పెద్దంపల్లిలో ఉచిత వైద్య శిబిరాలు

జమ్మికుంట, ఆగస్టు24 ( అక్షర కలం ):



జమ్మికుంట మండలంలోని మడిపల్లి, పెద్దంపల్లి గ్రామాల్లో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. మడిపల్లిలో డాక్టర్ సంధ్య, పెద్దంపల్లిలో ఎంఎల్‌హెచ్‌పీ దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాల్లో ప్రజలకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు.ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా నివారణపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ బాధితుల పట్ల వివక్ష చూపరాదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు ఎగిత పద్మకుమార్, పసుల తిరుమల వెంకటేష్, హెల్త్ సూపర్‌వైజర్ కొండపాక సదానందం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గన్ముకుల పాఠశాలను పరిశీలన

వీణవంక, ఆగస్టు 24 ( అక్షర కలం ):

వీణవంక మండలం గన్ముకుల జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ ను సోమవారం జిల్లా ట్రైనీ కలెక్టర్ హరి ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. గన్ముకుల హైస్కూల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది అంటూ, ఏబీవీపీ నాయకులు ప్రజావాణిలో దరఖాస్తు చేయగా, వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ ను పాఠశాల పరిశీలన పంపించడం జరిగింది. పాఠశాల పరిశీలన అనంతరం ట్రైని కలెక్టర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ సూచన మేరకు పాఠశాలను పరిశీలించడం జరిగిందని, పాఠశాల వివరాలను జిల్లా కలెక్టర్ కు అందజేయడం జరుగుతుందన్నారు. పాఠశాలను యధావిధిగా కొనసాగించాలంటూ, ట్రైనీ కలెక్టర్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.. హైస్కూల్లో విద్యార్థుల శాతం తగ్గడానికి ప్రధాన కారణం మోడల్ స్కూల్, ప్రైవేట్ స్కూల్ సమీపంలో ఉండడం వల్లే, విద్యార్థుల సంఖ్య తగ్గిందని, గ్రామంలో హైస్కూల్ ను యధావిధిగా కొనసాగించాలని, విద్యార్థుల పెంపుకు ఉపాధ్యాయులతో పాటుగా, గ్రామస్తులం పాటుపడతామని కలెక్టర్ ను కోరారు. ఈ పరిశీలనలో ట్రైనీ కలెక్టర్ తో పాటుగా గ్రామ సర్పంచ్ గాజుల శంకర్, ఉప సర్పంచ్ అనిల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సంజీవరెడ్డి,ఫ్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి,మండల విద్యాధికారిణి శోభారాణి, హెచ్ఎం శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సయ్య, జిపిఓ శ్రీనివాస్, ఎంఆర్సి నాగిరెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.






# రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుంది .. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**జగిత్యాల ఆగస్టు 24 ( అక్షర కలం )**

విద్యా రంగాన్ని పూర్తిగా నాశనం చేసే పనిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని అన్నారు ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2000 పాఠశాలలు మూత పడ్డాయి, 1,26,000 అడ్మిషన్లు తగ్గాయని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం 1000 గురుకులాలు స్థాపించి 7 లక్షల మంది విద్యార్థులకు విద్యను అందించిందని, ప్రస్తుతం మాత్రం 107 మంది విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఇద్దరు గురుకుల పాఠశాలలు నిర్వీర్యం చేయాలని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు తీసుకొచ్చారని విమర్శించారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు కలిసి 97 పాలిటెక్నిక్ కళాశాలలు రాష్ట్రంలో ఉన్నాయని, ఇప్పుడు ప్రభుత్వం 97 జీ.ఓ తీసుకువచ్చి పాలిటెక్నిక్ విద్యా ను కూడా నాశనం చేసే పని మొదలుపెట్టారని మండిపడ్డారు. ఈ సమావేశంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మార్క్ ఫెడ్ లోక బాపు రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేడు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు

**పారదర్శకంగా లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక**

**మండల తహశీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ**




**మందమర్రి, ఆగస్టు 24 అక్షర కలం:**

మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రకటించిన అర్హుల జాబితా ఆధారంగా నేడు సోమవారం ఉదయం 10 గంటలకు సంద్రోన్‌పల్లి గ్రామ పరిధిలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నామని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక చేసి, వారికి డబుల్ బెడ్రూం ఇళ్లలోని బ్లాక్, ఫ్లోర్ కేటాయించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు మాత్రమే హాల్ లోకి అనుమతి ఉంటుందని, ఇతరులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. కేటాయింపు అనంతరం లబ్ధిదారుల్లో ఎవరైనా అనర్హులు ఉన్నట్లు వ్రాతపూర్వకంగా ఫిర్యాదులు అందితే సమగ్ర విచారణ చేపట్టి, అనర్హులకు కేటాయించిన ఇళ్లను రద్దు చేయడంతో పాటు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించి, నిజమైన అర్హులకు ఇళ్లు దక్కేలా చూడాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# ఘనంగా మైసూర్ బేకరీ ప్రారంభం

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

సోమవారం సంగారెడ్డి పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా మైసూర్ బేకరీ ఘనంగా ప్రారంభమైంది. ఫౌండర్ ఆఫ్ మైసూర్ బేకరీ గ్రూప్ నిర్వాహకులు ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో తమ 37వ బ్రాంచ్ గా సంగారెడ్డిలో ప్రారంభించినట్టు తెలిపారు.సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ హాజరై బేకరీని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నాణ్యమైన కేకులు,బిస్కెట్లు,బర్గర్లు, ఎగ్ పఫ్,చికెన్ పఫ్ వంటి అన్ని రకాల నాణ్యమైన ఉత్పత్తులు తమ దగ్గర లభిస్తాయని తెలిపారు. కావున తమ బేకరీ ని సందర్శించి సంగారెడ్డి పట్టణ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ ఆఫీజ్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహేష్ స్నేహితులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24:**

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పోషక విలువలతో సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల కేంద్రీకృత వంటశాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ క్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ వారు కార్యక్రమ నిర్వహణకు ముందుకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 23.75 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల సంక్షేమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24:**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 27వ తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఎఈఆర్ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ లో భాగంగా ఆగస్టు 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో గ్రామ, వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా, ఎఎస్డి (ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితా బూత్ స్థాయి అధికారులు,



సూపర్వైజర్ల సమక్షంలో చదివి వినిపించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారులు ఫారం-6, 7, 8 అందుబాటులో ఉంచుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నోట్ చేసుకోవాలని తెలిపారు. అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నోటీసులు అందించాలని తెలిపారు. అవసరం ఉన్నచోట అదనపు ఎఈఆర్ఓల సంబంధిత ప్రతిపాదనలు రేపటి లోగా పంపించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ దాదాపు పూర్తి కావచ్చిందని, నోటీసులను సంబంధిత ఓటర్లకు 3 రోజులలోగా అందిస్తామని తెలిపారు. కార్యాచరణ ప్రకారం గ్రామ, వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, అదనపు ఎఈఆర్ఓల సంబంధిత ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24:**

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.



జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఝాన్సీ స్వయం సహాయక సంఘం సభ్యులు తమ సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ మక్బూల్ పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం తనకు రావలసిన వాటాను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్ వాసులు తమ కాలనీలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కొండగొర్ల చంద్రశేఖర్ తమకు కన్నేపల్లి మండలం పోలంపల్లి శివారులో గల భూమి ఆన్ లైన్ లో ఇతరుల పేరిట నమోదు అయిందని, ఈ పొరపాటును సవరించి తమ పేరిట మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం ఊత్కూర్ కు చెందిన తనుగుల సందీప్ కుమార్ తాను, తన భార్య దివ్యాంగులమని, నిరుపేదలమని, తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన ఎం ప్రభావతి తనకు కొంత స్థలం ఉందని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామానికి చెందిన తగరం పరంజ్యోతి తమ భూమి నిషేధిత జాబితాలో చూపుతోందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగారపు బాపు తమ ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని, భూమి కాగితాలు, ఖరీదైన వస్తువులు, మంచాలు, బట్టలు పూర్తిగా కాలిపోయాయని, తమ కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం - 2026 కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సోమవారం రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి, హైదరాబాద్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వనమహోత్సవం- 2026 లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ




సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 56 శాతం లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని, కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోటు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోయామని, ఇక నుండి కురిసే వర్షాల నీటిని ఒడిసిపట్టి, నిల్వచేసి సెప్టెంబర్ చివరి వారం లోగా 100 శాతం లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అటవీ శాఖ నర్సరీలలో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని, గుర్తించబడిన ప్రాంతాలలో ఎంపిక చేసిన మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షణ కూడా చేపట్టాలని, నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చూడాలని, పశువులు, జంతువుల నుండి కాపాడేందుకు నాటిన మొక్కలకు ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ లలో విరివిగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని, దేవాలయాల ప్రాంగణాలలో ప్రత్యేకమైన ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయడంలో భాగంగా ప్రజలందరికీ తెలిసే విధంగా మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో వనమహోత్సవం- 2026 లో భాగంగా 41 లక్షల మొక్కలను లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 27 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, నిర్ణీత గడువులోగా 100 శాతం లక్ష్యాలను సాధించే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ప్రజావాణిలో 37 అర్జీలు

**ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్లు సంగీత, పాండు**

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 57 ఫిర్యాదులు, వినతులు అందాయి. వీటిలో కలెక్టరేట్‌లో 37, సంగారెడ్డి డివిజన్‌లో 13, జహీరాబాద్ డివిజన్‌లో 3, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 ఫిర్యాదులు, వినతులు అందాయి. అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదు.ప్రజావాణిలో అందిన వినతుల్లో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఈఈపీఆర్, మున్సిపల్, ఇంటర్మీడియట్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి.ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి దరఖాస్తు పరిష్కారానికి తీసుకున్న చసంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955